## భారత్, చైనా కలిసి నడవాలి


వివరాలు 4లో..

# బలగం TV
# BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 13, సెప్టెంబర్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8

## కొత్త రైళ్ల కొనుగోలుకు పచ్చజెండా


వివరాలు 2లో..

# ధరణి పోర్టల్‌తో వేలాది ఎకరాలు చెర

- ధరణి పోర్టల్ తో వేలాది ఎకరాలు చెర
- నిషేధిత భూముల జాబితా కొత్తది కాదు
- భూములను కొల్లగొట్టకూడదనే చట్టం
- ధరణిలో 23 వేల ఎకరాల అక్రమాలు..
- భూభారతి ఆషామాషీగా తీసుకురాలేదు
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి వెల్లడి
- 22పై అసెంబ్లీలో వాడీవేడీగా చర్చ
- ఈనెల 16కు శాసనసభ వాయిదా 3లో..

ధరణి

# బ్లూ, గ్రీన్ సిటీగా హైదరాబాద్

- హైదరాబాద్ వైభవాన్నికాపాడుతాం
- సమర్థంగా పాలన కోసం క్యూర్ చట్టం
- మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు
- శాసనసభలో క్యూర్-2026 బిల్లు..


వివరాలు 2లో..

# 'ఢిల్లీ డిక్లరేషన్' కు ఆమోదముద్ర

- బ్రిక్స్ దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం
- డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రధాని మోదీ
- పహల్గామ్ దాడిని ఖండిస్తూ బ్రిక్స్ ప్రకటన
- ప్రధాని నరేంద్ర మోదీ దౌత్య విజయం
- భారత్ ఆకాంక్షలకు రష్యా, చైనా మద్దతు
- ఘనంగా ప్రారంభమైన బ్రిక్స్ సమావేశాలు
- పుతిన్, జిన్‌పింగ్ లకు మోదీ ఘన స్వాగతం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12:** భారత రాజధాని న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత్ మండపం వేదికగా 18వ బ్రిక్స్ సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. సమావేశంలో న్యూ ఢిల్లీ డిక్లరేషన్ 2026 కు బ్రిక్స్ కూటమిలోని సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. బ్రిక్స్ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన భారత్ కు ఇది అతిపెద్ద దౌత్య విజయం అని చెప్పొచ్చు. భారత్ న్యూ ఢిల్లీ డిక్లరేషన్ కు కూటమిలోని ఏ దేశం కూడా అభ్యంతరం చెప్పకపోవడం విశేషం. ఇది ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. భౌగోళిక రాజకీయ అంశాలపై సభ్య దేశాల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ న్యూ ఢిల్లీ డిక్లరేషన్ కు ఏకాభిప్రాయం లభించడం భారత్ కు అతిపెద్ద దౌత్య విజయంగా నిలుస్తుందని అన్నారు. అంతర్జాతీయ విధానాలు, ఆర్థిక సహకారం, శాంతిభద్రతలపై సభ్య దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ నిర్ణయం చాటిచెబు తోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో సంస్కరణలను ఇక ఏమాత్రం ఆలస్యం చేయకూడదని మోదీ స్పష్టం చేశారు. మిగతా 3లో..

# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్



- నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద ఏర్పాట్లు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం
- గణేశ్ ఉత్సవాలపై సమీక్ష

వివరాలు 2లో..

# బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

- తెలంగాణ భవన్‌లో 'నమూనా అసెంబ్లీ' నిర్వహణ
- కొండా సురేఖ తొలగింపుపై తలసాని తీవ్ర సెటైర్లు
- సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగానూ వ్యంగ్యాస్త్రాలు
- 100 రోజుల హామీల అమలుపైనా చురకలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 12:** కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీ విమర్శనాస్త్రాలు సంధించింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం హైదరాబాద్‌లోని భవన్‌లో 'మాక్ అసెంబ్లీ' నిర్వహించారు. ఈ వేదిక ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై, ప్రభుత్వ హామీల అమలుపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఈ మాక్ అసెంబ్లీలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు స్పీకర్‌గా వ్యవహరించగా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్రను పోషించి రేవంత్ రెడ్డిని అనుకరిస్తూ మాట్లాడారు. ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశాన్ని ప్రస్తావిస్తూ, "కొండా సురేఖ కుమార్తె నా గురించి మాట్లాడినందుకే ఢిల్లీకి వెళ్లి, మూడు రోజులు ఉండి, ఆమెను (సురేఖను) అణచివేసి వచ్చాను. బీసీ బిడ్డనైన నేను సీఎం అయ్యాక, ఆమెను కేబినెట్ నుంచి తీసేయక ఏం చేయగలను?" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రకటించిన 100 రోజుల హామీలపైనా తలసాని చురకలంటించారు. "100 రోజుల్లో మిగతా 3లో..

# సాగునీటి ప్రాజెక్టులపై చిత్తశుద్ధి అమోఘం

- చంద్రబాబు సారథ్యంలో ఏపీ సురక్షితం
- అమరావతి బయో వ్యాలీకి కేంద్రం అండ
- కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా వెల్లడి



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :** రాష్ట్ర సమగ్రాభివృద్ధికి జీవనాధారమైన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చూపిస్తున్న చిత్తశుద్ధి, పట్టుదల ప్రశంసనీయమని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా కొనియాడారు. కేవలం ఆరోగ్య రంగంపైనే కాకుండా, రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే కీలకమైన జలవనరులపైనా ముఖ్యమంత్రికి ఉన్న పట్టు అద్భుతమని ఆయన అన్నారు. శనివారం విజయవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలవరం ఎడమ కాలువ, వెలిగొండ, హంద్రీ-నీవా వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడంలో చంద్రబాబు చొరవ రాష్ట్ర ప్రగతికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. సాగునీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారానే రాష్ట్రం అన్ని మిగతా 3లో..

# 2022 నాటి ఉద్యోగాల నోటిఫికేషన్ రద్దు



- నిరుద్యోగులకు టీజీపీఎస్సీ షాక్..
- త్వరలోనే కొత్త నోటిఫికేషన్ విడుదల

వివరాలు 2లో..

# దసరాకు కొత్త పింఛన్ల పంపిణీ

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- కొత్తగా 2.50 లక్షల నూతన పింఛన్లు
- ఆగస్ట్ 9 నుంచి దరఖాస్తుల స్వీకరణ



**హైదరాబాద్, సెప్టెంబర్ 12:** తెలంగాణలో కొత్త పించన్ల కోసం ఎదురుచూస్తున్నవారికి శుభవార్త. కొత్త పింఛన్ల పంపిణీకి రేవంత్ సర్కార్ ముహూర్తం ఖారారు చేసింది. దసరా కానుకగా కొత్త పింఛన్లను అందించనుంది. కొత్తగా రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల నూతన పింఛన్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించింది. లక్షల మంది దరఖాస్తులు చేసుకోగా.. వీరిలో అసలైన అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. దరఖాస్తు చేసుకున్నవారి ఇంటికి అధికారులు నేరుగా వెళ్లనున్నారు. వారికి నిజంగా అర్హత ఉందా.. లేదా అనే వివరాలు పరిశీలించనున్నారు. ఈ నెలాఖరు వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అనంతరం వచ్చే నెల తొలివారంలో అర్హులను ఎంపిక చేసి జాబితా సిద్ధం చేయనున్నారు. అర్హులైన వారికి దసరా నుంచి పించన్ సొమ్ము పంపిణీకి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఇందుకు అవసరమైన బడ్జెట్ కూడా కేటాయించారు. దీంతో అర్హులను ఎంపిక చేయడమే తరువాయి. మిగతా 3లో..

# సుద్దాలకు 'తెలంగాణ తెలుగు తేజం' పురస్కారం



- సుద్దాల అశోక్ తేజకు మరో ప్రతిష్ఠాత్మక గౌరవం
- ఈనెల 22న కరీంనగర్‌లో పురస్కారం ప్రదానం

వివరాలు 3లో..

# ఒక్క క్లిక్‌తో పలు రకాల సేవలు

- అందుబాటులోకి హైడ్రా వెబ్‌సైట్..




**హైదరాబాద్, సెప్టెంబర్ 12:** హైదరాబాద్ నగరంలో విపత్తు నిర్వ హణ, చెరువుల పరిరక్షణ, ఆస్తుల రక్షణకు సంబంధించిన సమాచా రాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు హైడ్రా కీలక అడుగు వేసింది. హైడ్రా అధికారిక వెబ్‌సైట్ ను అందుబాటులోకి తీసుకొచ్చింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం కొత్త పోర్టల్‌ను ప్రారంభించారు. హైడ్రా అందిస్తున్న సేవలు, కార్యకలాపాలు, అత్య వసర సహాయం, వాతావరణ పరిస్థితులు, చెరువులు, భూములు, అధికార పరిధి తదితర వివరాలను ఇక ప్రజలు ఒకే వేదికపై తెలుసుకునే అవకాశం కల్పించారు. పోర్టల్‌లో చెరువుల హద్దులు, కాలువల వివరాలు, ప్రభుత్వ భూములు, విపత్తు నిర్వ హణకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉంటుంది. హైడ్రా చేపడుతున్న కార్యకలాపాలు, అధికారిక ప్రకటనలు, క్షేత్రస్థాయి కార్యక్రమాలు, చెరువుల పునరుద్ధరణ వివరాలను కూడా ప్రజలు తెలుసుకోవచ్చు. హైడ్రా 24 గంటల అత్యవసర హెల్ప్‌లైన్ 1070ను పోర్టల్‌లో ప్రత్యేకంగా అందుబాటులో ఉంచింది. చెట్లు కూలడం, అగ్ని ప్రమాదాలు, రహదారులపై నీరు నిలవడం, వరదలు, సహాయక చర్యలు లేదా ఇతర విపత్తు పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలు ఈ నంబర్‌కు సమాచారం అందించవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు ఇది ఉపయోగపడనుంది. ఫైర్ సేఫ్టీ ఎన్‌వోసీల కోసం కూడా పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సదుపాయం మిగతా 3లో..

# కోర్ అర్బన్ రీజియన్ 2026 బిల్లు

- హైదరాబాద్‌కు క్యూర్-2026 చట్టం
- ఇక బిల్లు ఆమోదమే తరువాయి

వివరాలు 4లో..

# భారీగా పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు



- కొత్తగా 1,010 సీట్లు అందుబాటులోకి
- 10,450కి చేరిన మొత్తం సీట్ల సంఖ్య

వివరాలు 3లో..

# విదేశాల్లో చదివే విద్యార్థులకు గుడ్‌న్యూస్..

- రూ.180 కోట్లు విడుదల చేసిన తెలంగాణ సర్కార్



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :** తెలంగాణ ప్రభుత్వం విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు భారీ ఊరట కల్పించింది. పెండింగ్‌లో ఉన్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల కోసం రూ.179.9 కోట్లను తాజాగా విడుదల చేసింది. ఉప ముఖ్య మంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధుల మిగతా 3లో..

# రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు వర్షాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 12 : తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటు వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఎవరికైనా ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు.

# తల్లి మరణవార్త తట్టుకోలేక కొడుకు ఆత్మహత్య..

## మెదక్ పెద్దశంకరంపేట విషాద ఘటన



హైదరాబాద్, సెప్టెంబర్ 12 : అమ్మంటే ప్రేమ.. అమ్మంటే ప్రాణం.. కానీ ఆ కన్నతల్లే లేదనే నిజాన్ని ఆ 19 ఏళ్ల కుమారుడు తట్టుకోలేకపోయాడు. తల్లి లేని లోకంలో తాను ఉండలేనంటూ.. అమ్మ వెళ్లిన దారినే తాను ఎంచుకున్నాడు! మెదక్ జిల్లాలో ఒకే కుటుంబంలో గంటల వ్యవధిలో జరిగిన ఈ జంట ఆత్మహత్యలు స్థానికులను కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండల పరిధిలోని మక్తా లక్ష్మపూర్ గ్రామానికి చెందిన బేతమ్మ (45), ఆమె భర్త బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. అక్కడే నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా, ఇటీవల హైదరాబాద్‌లోని వారి నివాసంలో భార్యాభర్తల మధ్య స్వల్ప గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బేతమ్మ, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హైదరాబాద్‌లో తల్లి బేతమ్మ ఆత్మహత్య చేసుకున్న విషయం సొంత ఊరిలో ఉన్న ఆమె కుమారుడు ప్రవీణ్ (19)కు తెలిసింది. ప్రాణంగా ప్రేమించే కన్నతల్లి ఇకలేదనే విషయాన్ని ఆ యువకుడు తట్టుకోలేకపోయాడు. తీవ్రమైన మానసిక వేదనకు లోనైన ప్రవీణ్, క్షణికావేశంలో తీవ్ర నిర్ణయం తీసుకున్నాడు. వెంటనే కొలపల్లి గ్రామ శివారులోకి వెళ్లి, అక్కడ ఉన్న ఒక చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకే కుటుంబంలో తల్లి, కొడుకు ఇద్దరూ గంటల వ్యవధిలోనే ఆత్మహత్యలకు పాల్పడటంతో మక్తా లక్ష్మపూర్ మరియు కొలపల్లి గ్రామాల్లో తీవ్ర శోకసంద్రం అలుముకుంది. మరణంలోనూ వీడని ఆ తల్లీకొడుకుల బంధం గురించి తలచుకుని గ్రామస్థులు కన్నీరుమున్నీరవుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నారు.

# ‘ఢీ-10’ డ్యాన్స్ షో విన్నర్ రాజు అరెస్ట్

- లైంగికంగా వేధించాడని ఓ యువతి ఫిర్యాదు

హైదారాబాద్, సెప్టెంబర్ 12 : తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన ‘ఢీ-10’ డ్యాన్స్ షో విజేత రాజును హైదరాబాద్ మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా సినిమా అవకాశాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేశాడని ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది. వివరాల్లోకి వెళితే.. ఓ యువతి ఈ నెల 9న మియాపూర్ పోలీసులకు రాజుపై ఫిర్యాదు చేసింది. తనను లైంగికంగా వేధించాడని, సినీ రంగంలో అవకాశాల పేరుతో వంచించాడని ఫిర్యాదులో పేర్కొంది. దీని ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆరోపణలకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు లభించడంతో రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, రాజు అరెస్ట్ విషయాన్ని పోలీసులు ఇన్ని రోజులు గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ వార్త బయటకు రావడంతో చర్చనీయాంశంగా మారింది. యువతి చేసిన ఆరోపణలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు ముగిసిన తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 12 : ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై ఈరో ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు. ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఏఎఫ్) వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

# 253 కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఫోరెన్సిక్ ల్యాబ్

## అమరావతిలోని తుళ్లూరులో నిర్మాణం..ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడి

అమరావతి, సెప్టెంబర్ 12 : రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీలు పోలీసు నేర పరిశోధనకు వెన్నెముక లాంటివని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. ఈరోజు రాజమండ్రిలో పర్యటించిన ఆయన... రాజధాని అమరావతిలోని తుళ్లూరులో రూ.253 కోట్లతో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద స్టేట్ లెవల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రాజమండ్రి, తిరుపతి, అనంతపురం, విశాఖ సహా పలు కేంద్రాల్లో ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌లను ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. డీఎన్ఏ నివేదికలను ప్రస్తుతం 7 రోజుల్లోనే, అత్యంత కీలకమైన కేసుల్లో 13 గంటల్లోనే అందిస్తున్నామని చెప్పారు. అలాగే, సైబర్ నేరాల నియంత్రణకు జిల్లా స్థాయిలో ‘క్లిక్’ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజమండ్రి గోదావరి పుష్కరాల సందర్భంగా రద్దీ నివారణకు అధునాతన డ్రోన్లు, రికార్డింగ్ మోడ్‌లోని సీసీటీవీల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తామని డీజీపీ పేర్కొన్నారు.

# కొత్త రైళ్ల కొనుగోలుకు పచ్చజెండా





- మెట్రో ప్రయాణికులకు శుభవార్త
- 600 కోట్ల వ్యయంతో కొత్త రైళ్ల కొనుగోలు
- రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబర్ 12 : హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. మెట్రో రైళ్లల్లో రద్దీని తగ్గించేం దుకు ప్రభుత్వం మందడుగు వేసింది. ప్రస్తుతం పీక్ సమయాల్లో మెట్రోలలో విపరీతమైన రద్దీ ఉంటుంది. కనీసం నిల్చోవడానికి కూడా స్థలం ఉండటం లేదు. ఈ సమస్యతో మెట్రో ప్రయాణికులు ఎప్ప టినుంచో ఇబ్బంది పడుతుండగా.. ఇప్పుడు పరిష్కారానికి ప్రభుత్వం సిద్దమైంది. రద్దీని తగ్గించేందుకు కొత్త రైళ్లను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం కొత్త రైళ్లను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం రెడీ అవుతోంది. ఒక్కో రైల్లో 2 వేల మంది ప్రయా ణించేందుకు వీలుగా 6 కోచ్‌ల రైళ్లను ప్రవేశపెట్టనుంది. తొలి దశలో 60 కోచ్‌లను కొనుగోలు చేయనుండగా.. ఆరు కోచ్‌లతో కూడిన 10 కొత్త రైళ్లను అందుబాటులోకి తీసుకొస్తారు. ఒక్కో రైలుకు రూ.60 కోట్ల వరకు ఖర్చు కానుంది. 60 కోచ్‌ల కొనుగోలుకు రూ.600 కోట్ల వరకు వ్యయం కానుందని అంచనా వేశారు. త్వరలోనే కొత్త రైళ్ల కోసం టెండర్లను ఆహ్వానించనున్నారు. బిడ్ల కోసం నోటిఫికేషన్ జారీ చేసిన తర్వత తుది వ్యయం ఎంత అవుతుందనేది తెలియనుంది. ప్రస్తుతం ఉన్న మెట్రో రైళ్లల్లో మూడు కోచ్‌లు మాత్రమే అందుబాటులోకి ఉన్నాయి. దీంతో ఒకేసారి వెయ్యి మంది మాత్రమే ప్రయాణించడానికి వీలు కలుగుతుంది. అదే ఆరు కోచ్‌లు అందుబాటులోకి వస్తే ఒకేసారి 2 వేల మంది ప్రయాణించవచ్చు. ప్రయాణికుల సంఖ్య దాదాపు రెట్టింపు అవుతుంది. వీటి వల్ల ఒకేసారి ఎక్కువమంది ప్రయాణి కులకు తమ గమ్యస్థానాలకు చేర్చవచ్చు.ఎక్కువ కోచ్‌లు కలిగిన రైళ్లు ఉండటం వల్ల ప్రయాణికుల రద్దీ కూడా తగ్గుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ విపరీతంగా ఉండటం వల్ల కనీసం అడుగు వేసేందుకు కూడా ఖాళీ స్థలం ఉండటం లేదు. దీని వల్ల ఇబ్బంది పడుతూ ప్రయాణం చేయాల్సి వస్తోంది. కొన్నిసార్లు తర్వాతి రైలు కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ప్రస్తుతం మెట్రోలో రోజూ 4.5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. అయితే కొత్త మెట్రో రైళ్లు వస్తే 6 లక్షల వరకు పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. అమీర్ పేట-రాయదుర్గం మార్గంలో ఎక్కువ రద్దీ ఉంటుంది. ఉదయం ఆఫీసులకు వెళ్లే సమయంలో, సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సమయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల రాయదుర్గం స్టేషన్‌లో కొన్నిసార్లు ప్రయాణికులకు కొద్దిసేపు ఆపాల్సి వస్తోంది. రద్దీని నియంత్రించేందుకు అధికారులు ఈ ప్రయత్నం చేస్తున్నారు. దీంతో కొత్త రైళ్లను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇవి అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. సౌకర్యవంతంగా ప్రయాణం చేయవచ్చు.

# స్త్రీనిధి రుణాల్లో రూ.30 లక్షల అవకతవకలు

- సంగారెడ్డి జిల్లాలో వెలుగులోకి ఘరానా మోసం
- అవకతవకలు.. సంఘ సభ్యుల ఆగ్రహం




హైదారాబాద్, సెప్టెంబర్ 12 : సంగారెడ్డి జిల్లా కంది మండలం పాతకంది గ్రామ సంఘంలో మహిళా సంఘాలకు మంజూరైన స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు తేలింది. వివిధ మహిళా సంఘాల పేర్లపై మంజూరైన రుణాల్లో సుమారు రూ.30 లక్షల మేర నిధులను మాజీ వీవోఏ వినియోగించినట్లు విచారణ నివేదికలో వెల్లడైనట్లు సమాచారం. రుణాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న మహిళలకు ఈ వ్యవహారం తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. దీంతో సదురు మహిళా సభ్యులు మంగళ వారం కందిలో నిర్వహించిన డ్వాక్రా మహిళా సంఘాల సమావేశంలో అధికారులను నిలదీశారు.వీవోఏ మార్పు.. వెబ్‌సైట్‌లో నమోదు కాలేదంటూ నివేదిక గత ఏడాది జనవరిలో గ్రామ సంఘం వీవోఏను తొలగించి కుమ్మరి పుష్పలతను కొత్త వీవోఏగా ఎన్నుకు న్నట్లు విచారణ నివేదికలో పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు ఆమె పేరు సెర్ప్ ఐబీ వెబ్‌సైట్‌లో నమోదు కాలేదని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అయినప్పటికీ రూ.50 వేల గౌరవ వేతనం డ్రా చేసి ఆమెకు చెల్లించినట్లు నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. గ్రామ సంఘ సమావేశాలకు మండల సమాఖ్య నుంచి కమ్యూనిటీ కోఆర్డినేటర్ క్రమం తప్పకుండా హాజరు కాకపోవడం, ఏపీఎం స్థాయిలో సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ అవకతవకలకు అవకాశం ఏర్పడినట్లు విచారణ నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. విచారణలో సుమారు రూ.30 లక్షల మేర అవకతవకలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు గుర్తించినప్పటికీ.. ఇప్పటి వరకు మాజీ వీవోఏపై కఠిన చర్యలు తీసుకోలేదని మహిళా సంఘాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సంబంధిత మహిళా సంఘాలకు కొత్త రుణాల మంజూరు కూడా నిలిచిపోయింది.తమకు రావాల్సిన రుణాలను వెంటనే మంజూరు చేయడంతో పాటు, నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. తమ ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాలపై ఆధారపడుతున్న తమకు ఈ పరిణామం తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని వారు పేర్కొంటున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

## నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద ఏర్పాట్లు

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం

## గణేశ్ ఉత్సవాలపై రేవంత్ రెడ్డి సమీక్ష



హైదరాబాద్, సెప్టెంబర్ 12: వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన... పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. “స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుంది” అని ఆయన స్పష్టం చేశారు. చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ... “మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసరాలను సిద్ధం చేయాలి” అని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. “హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. అందుకే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది” అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

# 2022 నాటి ఉద్యోగాల నోటిఫికేషన్ రద్దు

## నిరుద్యోగులకు టీజీపీఎస్సీ షాక్..

## త్వరలోనే కొత్త నోటిఫికేషన్ విడుదల



హైదరాబాద్, సెప్టెంబర్ 12: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ( టీజీపీఎస్సీ ) బిగ్ అలర్ట్ ఇచ్చింది. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు (లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి సంబంధించి 2022లో జారీ చేసిన బ్రీఫ్ నోటి ఫికేషన్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. మొత్తం 544 ఖాళీల భర్తీకి ఇచ్చిన ఈ నోటిఫికేషన్‌ను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు కమిషన్ వెబ్‌నోట్ ద్వారా వెల్లడించింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2022 డిసెంబర్ 31వ తేదీన కాలేజియేట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లోని అసిస్టెంట్ ప్రొఫెసర్లు (లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టుల భర్తీ కోసం బ్రీఫ్ నోటిఫికేషన్ నంబర్ 33/2022ను విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 544 ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించారు. అయితే ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన వివిధ అంశాలపై కమిషన్ సుదీర్ఘంగా చర్చించింది. అన్ని పరిస్థితులను సమగ్రంగా పరిశీలించిన తర్వాత 33/2022 బ్రీఫ్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని నిర్ణయించినట్లు తాజాగా టీజీపీఎస్సీ ప్రకటించింది. పాత నోటిఫికేషన్ రద్దు కావడంతో ఈ పోస్టుల భర్తీకి కొత్త నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. కొత్త నోటిఫికేషన్‌ను ప్రస్తుత నిబంధనలు, రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్ విధానాలకు అనుగుణంగా రూపొందించే అవకాశం ఉంది. కమిషన్ వెబ్‌నోట్ ప్రకారం.. 2022 డిసెం బర్ 31వ తేదీన జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్ నంబర్ 33/2022ను తక్షణమే రద్దు చేశారు. 544 ఖాళీలకు సంబంధించిన ఈ నోటిఫికేషన్ ఇక చెల్లుబాటు కాదని అభ్యర్థులు గుర్తించాలని కమిషన్ సూచించింది. పాత నోటిఫికేషన్ రద్దు కావడంతో గతంలో జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్ ఆధారంగా నియామక ప్రక్రియ కొనసాగదని అభ్యర్థులు గమనించాలి. కొత్త నోటిఫికేషన్ విడుదలైన తర్వాత అందులో పేర్కొనే పోస్టుల సంఖ్య, అర్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, దరఖాస్తు తేదీలు, ఎంపిక విధానం వంటి వివరాలను అభ్యర్థులు తప్పనిసరిగా పరిశీలించాలి. కొత్త నోటిఫికేషన్‌ను త్వరలోనే విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ తన వెబ్‌నోట్‌లో పేర్కొంది. దీంతో డిగ్రీ కాలేజీ లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు కొత్త ప్రకటన కోసం వేచి చూడాల్సి ఉంటుంది.

# సుద్దాలకు ‘తెలంగాణ తెలుగు తేజం’ పురస్కారం

హైదరాబాద్,సెప్టెంబర్ 12: తెలుగు సాహిత్య రంగంలో ప్రముఖ కవి, జాతీయ స్థాయి సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు మరో ప్రతిష్ఠాత్మక గౌరవం దక్కింది. బుర్ర నర్సమ్మ-లింగారెడ్డి స్మారక తెలంగాణ తెలుగు తేజం సాహిత్య పురస్కారం-2026కు ఆయనను ఎంపిక చేశారు. తెలుగు భాషా సంరక్షణ సంఘం-తెలంగాణ సాహితీ సంస్థ ఏటా ప్రదానం చేస్తున్న ఈ రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఈసారి సుద్దాల అశోక్ తేజను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. పురస్కార కమిటీ ఛైర్మన్, అవార్డు వ్యవస్థాపకుడు కెప్టెన్ డా. బుర్ర మధుసూదన్‌రెడ్డి, తెలుగు భాషా సంరక్షణ సంఘం-తెలంగాణ సాహితీ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి శుక్రవారం ఈ విషయాన్ని ప్రకటించారు. తెలుగు భాష, సాహిత్యానికి విశేష సేవలు అందిస్తున్న వారిని గుర్తించి గౌరవించాలనే ఉద్దేశంతో తెలంగాణ తెలుగు తేజం పురస్కారాన్ని ఏటా అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కవిగా, సినీ గేయ రచయితగా సుద్దాల అశోక్ తేజ తెలుగు భాషకు విశిష్టమైన సేవలు అందిస్తున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. ముఖ్యంగా తెలంగాణ భాష, యాస, సంస్కృతి, సామాజిక జీవనాన్ని ప్రతిబింబించే సాహిత్య, సినీ రచనలతో ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించింది. తెలంగాణ తెలుగు తేజం సాహిత్య పురస్కార ప్రదానోత్సవాన్ని ఈ నెల 22వ తేదీన కరీంనగర్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సుద్దాల అశోక్ తేజకు పురస్కారాన్ని అందజేయనున్నారు. తెలుగు భాషకు తెలంగాణ మట్టిబిడ్డలు అందించిన అమూల్యమైన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు పురస్కార కమిటీ ప్రతినిధులు తెలిపారు. భాషా పరిరక్షణ, సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్న రచయితలు, కవులు, సాహితీవేత్తలను ప్రోత్సహించడంలో భాగంగా ఈ పురస్కారాన్ని కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. సుద్దాల అశోక్ తేజ తెలుగు ఆయన సాహిత్య, సినీ ప్రస్థానాన్ని గుర్తిస్తూ తెలంగాణ తెలుగు తేజం పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కరీంనగర్‌లో ఈ నెల 22వ తేదీన జరగనున్న పురస్కార ప్రదానోత్సవంతో సుద్దాల అశోక్ తేజకు ఈ గౌరవం అధికారికంగా అందనుంది. ఈ కార్యక్రమానికి సాహితీవేత్తలు, భాషాభిమానులు, సాంస్కృతిక రంగానికి చెందిన ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉంది.

# (మొదటిపేజీ తరువాయి)

## 'దిల్లీ డిక్లరేషన్' కు ఆమోదముద్ర

బ్రిక్స్ దేశాలు ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకుంటూ ఏకాభిప్రాయంతో ముందుకు సాగాలని సూచించారు. మనం ఎవరికీ వ్యతిరేకం కాదు, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లేందుకే ప్రయత్నిస్తామని ప్రధాని తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. అధికారాలు, విశేషాధికారాలు ఉన్న అగ్ర దేశాల వ్యవస్థను రాబోయే 20 ఏళ్లలో ఒక భాగస్వామ్య వేదికగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిక్స్ సభ్య దేశాల కోసం ఒక సురక్షితమైన డిజిటల్ రిపోజిటరీ (డేటాబేస్) సృష్టించగలమని మోదీ ధీమా వ్యక్తం చేశారు. గ్లోబల్ సంస్కరణల దిశానిర్దేశం చేయడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషించాలన్నారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాలను, అంగీకరించిన అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి 'బ్రిక్స్ కంటిన్యూటీ, ఇంప్లిమెంటేషన్ మెకానిజం' ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కష్టకాలంలో ఉన్న గ్లోబల్ సౌత్ దేశాలకు ఈ కూటమి ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఆయన కోరారు. ఇక రెండు రోజుల పాటు జరిగే ఈ 18వ బ్రిక్స్ సమావేశంలో భారత్, రష్యా, చైనా, బ్రెజిల్, ఈజిప్ట్, ఇండోనేషియా, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా సహా మొత్తం 21 దేశాలు పాల్గొన్నాయి. అయితే విబేధాలు పక్కన పెట్టి మరీ ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా దేశాలు న్యూ దిల్లీ డిక్లరేషన్ కు ఆమోదం తెలపడం కీలకంగా మారింది. న్యూ దిల్లీ డిక్లరేషన్ లోని కీలక విషయాలు చూస్తే.. ప్రపంచ వాణిజ్య సంస్థల నిబంధనలకు విరుద్ధంగా, వాణిజ్యాన్ని దెబ్బతీసే విధంగా ఏకపక్ష సుంకాలు పెరగడంపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి ఏకపక్ష చర్యలను బ్రిక్స్ దేశాలు ఖండించాయి. అలాగే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యుద్ధాలు, ఘర్షణలను శాంతి యుతంగా, దౌత్య పరంగా మాత్రమే పరిష్కరించుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామని బ్రిక్స్ కూటమి స్పష్టం చేసింది. అలాగే ప్రపంచంలో నెలకున్న సమస్యలపై వివిధ దేశాలు చూసే దృక్కోణాన్ని తాము స్వాగతిస్తున్నట్లు తెలిపాయి. దాంతోపాటు అంతర్జాతీయ సమస్యలపై శాంతి యుత చర్చలు, భాగస్వామ్యాన్ని నొక్కి చెప్పాయి. అలాగే గతేడాది ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇది క్రిమినల్ చర్య అని ఎప్పటికీ క్షమించరానిదాని తెలిపాయి. ఈ ఘోర ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా.. మరెందరో గాయపడినట్లు వివరించాయి. ఇలాంటి ఉగ్రవాద చర్యలను అసలు ఉపేక్షించేది లేదని బ్రిక్స్ కూటమి దేశాలు స్పష్టం చేశాయి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఎదుర్కొనేందుకు తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించాయి. వీటితోపాటు మారుతున్న, వర్తమాన ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని బ్రిక్స్ దేశాలు డిమాండ్ చేశాయి. భారత్ నేతృత్వంలో ఈ బ్రిక్స్ సదస్సు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని తీర్మానించాయి. ఐరాస భద్రతా మండలిలో నిర్మాణాత్మక మార్పులు, ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకు భద్రతా మండలిలో మెరుగైన ప్రాతినిధ్యం దక్కాలని దిల్లీ డిక్లరేషన్ ఆకాంక్షించింది. ముఖ్యంగా భద్రతా మండలిలో భారత్, బ్రెజిల్ దేశాలకు మరింత పెద్ద పాత్ర దక్కాలన్న డిమాండ్‌కు శాశ్వత సభ్య దేశాలైన చైనా, రష్యాలు తమ మద్దతును పునరుద్ఘాటించాయి. ఐఎంఎఫ్?, ప్రపంచ బ్యాంకుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం దక్కాలని బ్రిక్స్ కూటమి డిమాండ్ చేసింది.వాణిజ్యపరంగా ఈ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం డాలర్‌కు బదులుగా స్థానిక కరెన్సీలలోనే ఎక్కువగా జరగాలని, సరిహద్దు చెల్లింపుల కోసం ఆచరణాత్మక పరిష్కారాలను సులభతరం చేయాలని డిక్లరేషన్ పేర్కొంది. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా విధిస్తున్న సుంకాలు, బలవంతపు చర్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ ప్రదర్శించాలని పిలుపునిచ్చింది. పహల్గాం ఉగ్రదాడిని బ్రిక్స్ డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. సరిహద్దు ఉగ్రవాదం, ఉగ్ర నిధులు అరికట్టాలని, ఉగ్రవాద నిర్మూలనలో ద్వంద్వ వైఖరి వీడాలని స్పష్టం చేసింది. అలాగే అణు కేంద్రాలపై జరుగుతున్న దాడులను, పెరుగుతున్న అణ్వస్త్ర ప్రమాదాలను ఖండించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందాల్సిన నిధులను పక్కదారి పట్టిస్తూ, గ్లోబల్ మిలిటరీ ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం పట్ల విచారం వ్యక్తం చేసింది. అలాగే అభివృద్ధి చెందుతున్న దేశాలకు శిలాజ ఇంధనాలు ఇంకా అవసరమేనని స్పష్టం చేస్తూనే, పర్యావరణ అనుకూల ఇంధనాల వైపు మారాలని డిక్లరేషన్ సూచించింది.

## బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

హామీలు అమలు చేస్తామని చెప్పాం కానీ, ఏ 100 రోజుల్లో అని చెప్పామా? ఢిల్లీలో మాకూ కొన్ని ఇబ్బందులు ఉంటాయి కదా" అంటూ ఎద్దేవా చేశారు. తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల ప్రవర్తన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై చర్చకు పట్టుబట్టినందుకు గాను, సెప్టెంబర్ 9న కేటీఆర్ తో సహా 22 మంది ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్‌కు నిరసనగానే బీఆర్ఎస్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. కేటీఆర్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ వేదికపై, ప్రభుత్వం చర్చకు అనుమతించని ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు.

## దసరాకు కొత్త పింఛన్ల పంపిణీ

ఈ నెలలోనే పరిశీలన పూర్తి చేసి పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే క్షేత్రస్థాయి పరిశీలనలో జాప్యం, సర్టిఫికేట్ల జారీలో సమస్యలు తలెత్తడంతో ఆలస్యమైంది. ఆగస్ట్ 9 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుండగా.. సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు పొడిగించింది. అయితే దివ్యాంగులు, డయాలసిస్, ఫైలేరియా, చేనేత, గీత కార్మికులు, వితంతువులు, ఒంటరి మహిళల అర్హతలను నిర్ధారించేందుకు పత్రాలు అవసరం. ఒంటరి మహిళలకు సంబంధించి విడాకుల డాక్యుమెంట్స్, కోర్టు ఉత్తర్వులతో పాటు ఏడాదిగా ఒంటరిగా ఉంటున్నట్లు ధ్రువీకరణ అవసరమవుతుంది. అలాగే వితంతువులు భర్త డెత్ సర్టిఫికేట్ సమర్పించాలి. అయితే భర్త చనిపోయి ఎక్కువకాలం అయితే సర్టిఫికేట్ పొందటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక గీత, చేనేత, ఫైలిరియా, డయాలసిస్ వర్గాలకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి ధృవీకరణ పత్రాలు పొందటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ధ్రువీకరణ పత్రాల అవసరం లేకుండానే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. అయితే ఆ తర్వాత ధృవీకరణ సమయంలో పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అప్పుడే పింఛన్లకు అర్హత సాధిస్తారు. అధికారులో క్షేత్రస్థాయిలో పర్యటించి కుటుంబ పరిస్థితి, ఆదాయం, ఇతర ఆధారాలను పరిశీలించనున్నారు. అనంతరం తుది జాబితా సిద్ధం చేయనున్నారు. ప్రస్తుతం 2.50 లక్షల పింఛన్లకు మాత్రమే ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో అంతమంది అర్హులను మాత్రమే ప్రస్తుతం ఎంపిక చేయనున్నారు. ప్రాధాన్యత వారీగా పూర్తి అర్హతలు ఉన్నవారిని ఎంపిక చేయనున్నారు. దసరా నుంచి కొత్త ఫించన్లను అందనుడటంతో అర్హులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తుది జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపనున్నారు. ప్రభుత్వం ఆమోదించాక పింఛన్లను పంపిణీ చేయనున్నారు.

## విదేశాల్లో చదివే విద్యార్థులకు గుడ్‌న్యూస్..

కేటాయింపు జరిగింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,008 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. విడుదలైన నిధుల్లో అత్యధికంగా ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద 1,063 మంది మైనారిటీ విద్యార్థులకు రూ.76.1 కోట్లు కేటాయించారు. అలాగే, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి ద్వారా 1,193 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.48.4 కోట్లు, 573 మంది ఎస్టీ విద్యార్థులకు రూ.36.9 కోట్లు, మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యా నిధి కింద 179 మంది బీసీ విద్యార్థులకు రూ.18.4 కోట్లు అందజేయనున్నారు. ఇప్పటికే స్కాలర్‌షిప్‌లు మంజూరైన లబ్ధిదారులందరికీ చెల్లింపులు పూర్తయ్యాయని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో తమ చదువును ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించేందుకు ఈ నిధులు దోహదపడతాయని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.

## ఒక్క క్లిక్‌తో పలు రకాల సేవలు

కల్పించారు. భవన యజమానులు, నిర్మాణదారులు దరఖాస్తు సమర్పించడంతోపాటు అది ఏ దశలో ఉందో తెలుసుకోవచ్చు. అధికారులు ప్రత్యేక డ్యాష్‌బోర్డు ద్వారా దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకునే వీలుంది. భారీ వర్షాలు, వరదల సమయంలో నీరు నిలిచే ప్రాంతాలను ముందుగానే గుర్తించేందుకు పోర్టల్‌లో ప్రత్యేక మ్యాప్‌లను అందుబాటులో ఉంచారు. జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ పరిధిలోని వాటర్‌లాగింగ్, వరద ప్రభావిత ప్రాంతాలను వేర్వేరుగా పరిశీలించవచ్చు. దీంతో వర్షాల సమయంలో అప్రమత్తంగా ఉండాల్సిన ప్రాంతాలపై ప్రజలకు అవగాహన పెరగనుంది. పోర్టల్‌లో లైవ్ రైన్‌ఫాల్ మ్యాప్స్, రోజువారీ వర్షపాతం వివరాలు, వాతావరణ అంచనాలు, హైదరాబాద్ డాప్లర్ రాడార్ సమాచారం అందుబాటులో ఉంటుంది. ముఖ్యంగా భారీ వర్షాల సమయంలో తాజా పరిస్థితులను తెలుసుకోవడానికి ఈ సమాచారం ఉపయోగపడనుంది. హైడ్రా వెబ్‌సైట్ నుంచి హెచ్ఎండీఏ లేక్స్ పోర్టల్‌కు నేరుగా వెళ్లే అవకాశం కల్పించారు. చెరువులు, జలాశయాలకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ వివరాలను పరిశీలించవచ్చు. చెరువుల పరిసరాల్లో నిర్మాణాలు చేపట్టే ముందు వర్తించే నిబంధనలను తెలుసుకోవడానికి ఈ సమాచారం ఉపయోగపడుతుంది. తెలంగాణ ప్రభుత్వ భూ భారతి పోర్టల్‌కు కూడా హైడ్రా వెబ్‌సైట్‌లో నేరుగా లింక్ ఇచ్చారు. భూమి కొనుగోలు లేదా ఇతర లావాదేవీలకు ముందు సర్వే నంబర్, పట్టాదారు వివరాల ఆధారంగా అందుబాటులో ఉన్న భూ రికార్డులను పరిశీలించుకునే అవకాశం ఉంటుంది. హైడ్రా పునరుద్ధరించిన చెరువులు, చేపట్టిన పరిరక్షణ కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పనులకు సంబంధించిన తాజా సమాచారాన్ని కూడా పోర్టల్‌లో పొందుపరిచారు. వార్తలు, ఫ్లాష్ న్యూస్, ఫొటోలు, వీడియోల ద్వారా హైడ్రా కార్యకలాపాలను ప్రజలు తెలుసుకోవచ్చు.

## సాగునీటి ప్రాజెక్టులపై చిత్తశుద్ధి అమోఘం

రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, ఈ దిశగా చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఆరోగ్య శాఖ మంత్రిగా పర్యటనకు వచ్చినప్పటికీ, రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఆయన ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించడం గమనార్హం.రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయ తలపెట్టిన క్వాంటం బయో వ్యాలీకి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలన్న ముఖ్యమంత్రి చంద్ర బాబు ఆలోచనను జేపీ నడ్డా స్వాగతించారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుపై మరింత లోతుగా చర్చించేందుకు, అవసరమైన సూచనలు చేసేందుకు త్వరలోనే కేంద్రం నుంచి ఒక సాంకేతిక బృందాన్ని అమరావతికి పంపుతామని వెల్లడించారు. క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటుపై ముఖ్యమంత్రి చేసిన సూచనలు, ఆయన విజన్ అద్భుతంగా ఉన్నాయని, వాటిని తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

# ధరణి పోర్టల్ తో వేలాది ఎకరాలు చెర

**22ఏపై అసెంబ్లీలో వాడీవేడీగా చర్చ**

**ఈనెల 16కు శాసనసభ వాయిదా**

హైదరాబాద్, సెప్టెంబర్ 12: తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు భూముల వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. ముఖ్యంగా 22ఏ నిషేధిత భూముల జాబితా అంశం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. 22ఏకారణంగా రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని, భూముల రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయని, ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోంది. తాజాగా అసెంబ్లీలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గణాంకాలతో బీఆర్ఎస్‌కు కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 22ఏ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ రంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని, భూముల విలువలు భారీగా పెరిగాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాల వల్ల రియల్ ఎస్టేట్ రంగంపై ప్రతికూల ప్రభావం పడుతోందని విమర్శించారు. ఈ ఆరోపణలకు అసెంబ్లీ వేదికగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమాధానమిచ్చారు. 22ఏ కారణంగా రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రాబడి తగ్గిపోయాయన్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన గణాంకాలను వెల్లడించారు. మంత్రి అసెంబ్లీకి తెలిపిన వివరాల ప్రకారం.. 2025 ఏప్రిల్, మే, జూన్, జులై, ఆగస్టు ఐదు నెలల కాలంలో రాష్ట్రంలో మొత్తం 4,90,478 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యాయన్నారు. అదే ఐదు నెలల కాలాన్ని 2026లో పరిశీలిస్తే 5,10,273 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయినట్లు తెలిపారు. అంటే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 19,795 డాక్యుమెంట్లు అదనంగా రిజిస్టర్ అయ్యాయని మంత్రి వివరించారు. ఇక రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయాన్ని పరిశీలించినా తగ్గుదల కనిపించలేదని మంత్రి పొంగులేటి తెలిపారు. 2025లో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలల్లో రూ.6,216 కోట్ల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. అదే 2026లో ఐదు నెలల కాలంలో రూ.7,575 కోట్ల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. అంటే గత ఏడాదితో పోలిస్తే రూ.1,359 కోట్ల అదనపు ఆదాయం వచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ గణాంకాలను ప్రస్తావిస్తూ 22ఏ వల్ల రిజిస్ట్రేషన్లు, ఆదాయం తగ్గిపోయాయన్న బీఆర్ఎస్ ఆరోపణలను మంత్రి పొంగులేటి తిప్పికొట్టారు. వాస్తవ పరిస్థితిని గణాంకాలే చెబుతున్నాయని స్పష్టం చేశారు. మరోవైపు 22ఏ నిషేధిత భూముల జాబితా విషయంలో మాత్రం రాజకీయ వాదోపవాదాలు కొనసాగాయి. భూముల రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, రియల్ ఎస్టేట్ రంగం, సామాన్యుల భూ హక్కులు వంటి అంశాలు ఈ వివాదంతో ముడిపడి ఉన్నాయి. దీంతో 22ఏ అంశం కేవలం రెవెన్యూ వ్యవహారంగా కాకుండా తెలంగాణ రాజకీయాల్లో కీలకమైన రాజకీయ అంశంగా మారింది. మరోవైపు తెలంగాణ శాసనసభ సాక్షిగా రాష్ట్రంలో నెలకున్న భూ సమస్యలు, 22ఏ నిబంధనలు , ధరణి అక్రమాలపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ధరణి పోర్టల్ ను అడ్డుపెట్టుకుని గత పాలకులు లక్షలాది ఎకరాలను చెరబట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు అసెంబ్లీ సాక్షిగా వారి బండారం బయటపడుతుండటంతోనే సభ నుంచి తప్పించుకొని తిరుగుతున్నారని విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను స్వప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో కేసీఆర్ కుటుంబం, వాళ్ల బంధువులు మాత్రమే బాగుపడ్డారని అన్నారు. అలాగే ధరణి తప్పిదాలతో వందల మంది రైతుల ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. తెలంగాణలోని దాదాపు 2.49 కోట్ల ఎకరాల భూమిని తమ సొంత ఆస్తిగా భావించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగించిందని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. ధరణి పోర్టల్ నిర్వహణను దివాలా తీసిన ఒక విదేశీ కంపెనీకి అప్పగించారని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్ పై ఉన్న నియంత్రణను దుర్వినియోగం చేస్తూ అర్ధరాత్రి సమయాల్లో రిజిస్ట్రేషన్లు చేశారని కీలక ఆరోపణలు చేశారు. ప్రజల ఆస్తులను పరిరక్షించడమే రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. శాసనసభలో 22ఏ నిషేధిత భూముల అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం ఆశామాషీగా తీసుకురాలేదని.. దాదాపు 18 రాష్ట్రాల్లోని అధికారులు అధ్యయనం చేశాక..ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించిన తర్వాతే భూ భారతికి రూపకల్పన చేశామని స్పష్టం చేశారు. భూభారతి ఎన్ ఐసి పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలోనే పారదర్శకంగా నడుస్తుందని తెలిపారు. అలాగే 22ఏ నిషేధిత భూముల అంశంపై మాట్లాడుతూ.. 2023 నాటికి 22 ఏ జాబితాలో కోటి 2 లక్షల 52 వేల 690 ఎకరాలకు సంబంధించిన వివరాలను సభ ముందు ఉంచారు మంత్రి పొంగులేటి. వీటిలో అటవీ, అసైన్డ్, ఇతర ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 1995లో ఘట్కేసర్ రైల్వేస్టేషన్ భూమిని కూడా ఒకరికి రిజిస్ట్రేషన్ చేశారన్న మంత్రి పొంగులేటి, అలాంటి అక్రమాలు మళ్లీ జరగొద్దనే నిషేధిత భూముల జాబితా తెచ్చారన్నారు. మళ్లీ కేసీఆర్? హయాంలో 2016లో కొత్తగా జీవో 121 జారీ చేశారని చెప్పారు. జీవో 121 తీసుకువచ్చి చాలామంది రైతులను నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. తమ ప్రభుత్వం కొత్తగా నిషేధిత జాబితాలో ఒక్క ఎకరమూ చేర్చలేదని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆస్తుల పరిరక్షణే రెవెన్యూ సంస్కరణల లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నిషేధిత జాబితాలో ఉండకూడని భూములు కొన్ని ఆనాటి నుంచి ఉన్నాయని పొంగులేటి వివరించారు. బీఆర్ఎస్ హయాంలోనూ అదే కాపీని అప్‌లోడ్ చేశారన్నారు. దానిని అధికారులు ప్రింట్ తీసి మరోసారి అప్‌లోడ్ చేశారని వివరించారు. ఇక్కడే పొరపాటు జరిగిందని చెప్పారు. ఇది మొదటి నుంచీ జరిగిన పొరపాటని మంత్రి అసెంబ్లీలో వెల్లడించారు. ఉమ్మడి ఏపీ హయాం నుంచి వచ్చిన జీవోల ఆధారంగానే ఆ కాపీ రూపొందిందని పొంగులేటి గుర్తు చేశారు. గతంలో కొన్ని భూములను ప్రభుత్వం విక్రయించడం, ప్లాట్లు చేసి ఇవ్వడం జరిగిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. విక్రయించిన భూములను అధికారులు పొరపాటున 22ఏలో చేర్చారన్నారు. అధికారులు చేసిన పొరపాటును యుద్ధప్రాతిపదికన సరిదిద్దుతున్నామని చెప్పారు. నిషేధిత జాబితా నుంచి గతంలోనే తొలగిస్తూ ఇచ్చిన జీవో చూపితే వెంటనే తొలగిస్తున్నామన్నారు. ఒక్కరోజులోనే మ్యుటేషన్ చేయటం వల్ల ఎన్నో అక్రమాలు జరిగాయన్న పొంగులేటి, ధరణి పోర్టల్‌లో 80 మాడ్యూల్స్ పెట్టి పేద రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని మండిపడ్డారు. ఇప్పుడు భూభారతి చట్టంలో 80 మాడ్యూల్స్‌కు బదులు కేవలం 5 మాడ్యూల్స్ పెట్టామన్నారు. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి మొత్తం 1,02,05,250 ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభకు వివరించారు. 22ఏలోని ప్రభుత్వ వ్యవసాయ భూములు 96,36,777 ఎకరాలు ఉన్నాయన్నారు. ప్రైవేటు వ్యవసాయ భూమి 3,73,930 ఎకరాలు ఉందని వివరించారు. వ్యవసాయేతర భూమి 1,94,543 ఎకరాలున్నట్లుగా సభలో వివరించారు. ఇవి కాకుండా ఎండోమెంట్ భూములు 5,12,792 ఎకరాలు ఉన్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ దిగిపోయేనాటికి, ఇప్పటికి నిషేధిత జాబితాలోని భూమి 47,440 ఎకరాలు తగ్గిందని పొంగులేటి తెలిపారు. 23వేల ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి ప్రజలకు ఇచ్చామన్నారు. పాత జీవోల్లోని తప్పులను గుర్తించి మరో 20వేల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించామని చెప్పారు. 22ఏ నుంచి తొలగించిన మొత్తం 47,440 ఎకరాల్లో ప్రతి ఎకరాకు లెక్కలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో తొలగించిన 23వేల ఎకరాలకు లెక్కలు లేవని కమిటీ చెప్పిందని పొంగులేటి గుర్తుచేశారు. కోట్ల మంది రైతుల వివరాలను విదేశీ సంస్థ అయిన టెరాసిస్ చేతిలో పెట్టారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చాక, టెరాసిస్ సంస్థను తొలగించి కేంద్ర సంస్థ అయిన ఎన్ఐసీకి అప్పగించామన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 387 గ్రామాలకు నక్షలు లేవన్నారు. దాదాపు 125 ఏళ్ల తర్వాత గ్రామాల్లో సమగ్ర భూసర్వే చేపట్టామని పొంగులేటి తెలిపారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన గ్రామాల్లో ఇప్పటికే భూమి మొత్తం సర్వే చేసి రైతులకు పాసుపుస్తకాలు ఇచ్చామని తెలిపారు. వచ్చే ఏడాదిన్నరలోపు రాష్ట్రవ్యాప్తంగా భూసర్వే పూర్తి చేసి రైతులకు మేలు చేస్తామని స్పష్టం చేశారు. ధరణి పోర్టల్‌ను గుప్పిట్లో పెట్టుకొని, గత పాలకులు అర్ధరాత్రి వేళ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాలను తమ సొంత ఆస్తిలా గత పాలకులు భావించారని ఆక్షేపించారు. ధరణి పోర్టల్‌లో దొర్లిన తప్పులకు లక్షలాది రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పోర్టల్‌లో తప్పుల నమోదు వల్ల వందల సంఖ్యలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్‌కు లాక్ అనే సిస్టమ్ పెట్టి అందరి భూములపై నిఘా పెట్టారన్నారు.

# భారీగా పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు

**కొత్తగా 1,010 సీట్లు అందుబాటులోకి**

**10,450కి చేరిన మొత్తం సీట్ల సంఖ్య**

హైదరాబాద్, సెప్టెంబర్ 12: తెలంగాణ వైద్య విద్యలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో కొత్తగా 1,010 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో 2026--27 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని 66 మెడికల్ కాలేజీల్లో మొత్తం ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 10,450కి చేరింది. దేశవ్యాప్తంగా మెడికల్ సీట్ల వివరాలతో మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డు శుక్రవారం విడుదల చేసిన సీట్ మ్యాట్రిక్స్‌లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. తాజా పెంపుతో అత్యధిక ఎంబీబీఎస్ సీట్లు ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఐదో స్థానానికి చేరింది. రాష్ట్రంలో ప్రస్తుతం 36 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 4,400 సీట్లు ఉన్నాయి. వీటిలో 4,290 సీట్లు గత సీట్లకు రెన్యువల్ కాగా.. కొత్తగా మరో 110 సీట్లు పెరిగాయి. మహబూబ్‌నగర్, సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 25 చొప్పున, నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఆదిలాబాద్ రిమ్స్‌లో 30 చొప్పున సీట్లు పెరిగాయి. రాష్ట్రంలోని 30 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో మొత్తం 6,050 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 5,150 సీట్లు రెన్యువల్ కాగ.., కొత్తగా 900 సీట్లు చేరాయి. కొత్తగా ఏర్పాటైన రాజరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్



మెడికల్ సైన్సెస్‌లో 150 సీట్లు కేటాయించారు. మిగిలిన సీట్లు ఇప్పటికే ఉన్న పలు ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో సీట్ల పెంపు ద్వారా అందుబాటులోకి వచ్చాయి. కొత్త సీట్లతో రాష్ట్రంలో వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు మరిన్ని అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య, సీట్ల సామర్థ్యం పెరుగుతున్న నేపథ్యంలో వైద్య విద్యను జిల్లాల స్థాయికి విస్తరించే ప్రయత్నాలకు ఇది మరింత ఊతమివ్వనుంది. ఎయిమ్స్, జిప్‌మర్ వంటి జాతీయ ప్రాధాన్యం ఉన్న సంస్థలను మినహాయిస్తే దేశవ్యాప్తంగా 836 మెడికల్ కాలేజీల్లో 1,40,214 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఇందులో 445 ప్రభుత్వ కాలేజీల్లో 63,971 సీట్లు, 391 ప్రైవేట్ కాలేజీల్లో 76,243 సీట్లు ఉన్నాయి. కొత్త కాలేజీలు, సీట్ల పెంపు ద్వారా ఈ ఏడాది దేశవ్యాప్తంగా 13,186 సీట్లు అదనంగా అందుబాటులోకి వచ్చాయి. మరో 1,27,028 సీట్లు రెన్యువల్ అయ్యాయి. దేశంలో 15,745 సీట్లతో కర్ణాటక మొదటి స్థానంలో ఉంది. ఉత్తరప్రదేశ్ 14,400, తమిళనాడు 14,299, మహారాష్ట్ర 13,249 సీట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 40 మెడికల్ కాలేజీల్లో మొత్తం 7,615 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. మెడికల్ కాలేజీలు తమకు మంజూరైన సీట్ల మేరకే అడ్మిషన్లు ఇవ్వాలని జాతీయ వైద్య కమిషన్ స్పష్టం చేసింది. ఒక్క సీటు అదనంగా భర్తీ చేసినా ఎన్ఎంసీ చట్టం-2019 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అవసరమైతే క్రిమినల్ చర్యలతోపాటు జరిమానాలు విధించే అవకాశం ఉందని తెలిపింది. కౌన్సెలింగ్ కమిటీలు కూడా అనుమతించిన సీట్లకు మించి ప్రవేశాలు కల్పించకూడదని స్పష్టం చేసింది. కొత్తగా అనుమతి పొందిన లేదా సీట్లను పెంచుకున్న ప్రైవేట్ మెడికల్ కాలేజీలు ఏడు రోజుల్లోగా ఎంఏఆర్‌బీ డైరెక్టర్ పేరిట ఎలక్ట్రానిక్ బ్యాంక్ గ్యారంటీ సమర్పించాలని స్పష్టం చేసింది. దాని పరిశీలన పూర్తయిన తర్వాతే లెటర్ ఆఫ్ పర్మిషన్ జారీ చేయనున్నట్లు ఎన్ఎంసీ వెల్లడించింది.

# బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా హైదరాబాద్

- హైదరాబాద్ వైభవాన్నికాపాడుతాం
- సమర్థంగా పాలన కోసం క్యూర్ చట్టం
- మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాక్యలు
- శాసనసభలో క్యూర్?-2026 బిల్లు..

హైదరాబాద్, సెప్టెంబర్ 10: కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు-2026ను మంత్రి శ్రీధర్‌బాబు శాసన సభలో ప్రవేశపెట్టారు. హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా బిల్లు తెచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా క్యూర్ చట్టంలో మార్పులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరాలతో పోటీపడే విధంగా చేయాలనే ఉద్దేశంతో మూసీ పునరుజ్జీవం చేపట్టామని తెలిపారు. బెంగుళూరు, ముంబై, దిల్లీ మాదిరిగా హైదరాబాద్ మహా నగరపాలిక సంస్థ చట్టంలో సెక్షన్లు తగ్గించే ప్రణాళిక చేస్తున్నామని వివరించారు. హైదరాబాద్ విస్తరణ పెద్ద ఎత్తున జరుగుతోందని, రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా మరింత సమర్థంగా పాలన కోసం క్యూర్ చట్టం తీసుకువచ్చినట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్ గత వైభవాన్ని కాపాడుకుంటూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సిద్ధం చేయాలని అన్నారు. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ రూపొందించుకుని ముందుకెళ్తున్నామని వివరించారు. 2034 నాటికి ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళుతున్నట్లు మంత్రి శ్రీధర్? బాబు తెలిపారు. లక్ష్య సాధనకు హైదరాబాద్ మరింత అధునాతనంగా అంతర్జాతీయ స్థాయికి చేరాలని అన్నారు. ప్రపంచ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్ ఎదగాలన్నారు. పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించే స్థాయికి మనం ఎదగాలని పేర్కొన్నారు. క్యూర్, ప్యూర్, రేర్ నినాదంతో రాష్ట్ర అభివృద్ధికి చర్యలున్నాయని గుర్తు చేశారు.క్యూర్' తెలంగాణ ఆర్థిక ప్రగతికి అత్యంత కీలక ప్రాంతమని, రాష్ట్ర విస్తీర్ణంలో చిన్నదైనా తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో క్యూర్ పాత్ర పెద్దదని శ్రీధర్ బాబు వివరించారు. 2025-26లో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని, క్యూర్ పరిధిలో 10.7 శాతం వృద్ధి నమోదైనట్లు తెలిపారు. ఆర్థిక వ్యవస్థ సేవా రంగానికి సంబంధించి 68.6 శాతం వృద్ధి నమోదైందని అన్నారు. సేవా రంగం, పెట్టుబడులు, ఉపాధికి ప్రధాన కేంద్రంగా హైదరాబాద్ ఉందని అన్నారు. క్యూర్ పరిధి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు ఆర్థిక ఉత్పత్తిలో తొలి 3 స్థానాల్లో ఉన్నాయన్నారు. క్యూర్ ప్రాంతంలో పరిపాలన వ్యవస్థను భవిష్యత్ అవసరాల మేరకు పునర్నిర్మించాలన్నారు. హైదరాబాద్?లో రవాణా కోసం కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ చేశామని శ్రీధర్? బాబు తెలిపారు. రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా క్యూర్ చట్టం పని చేస్తుందని అన్నారు. మూసీ పునరుజ్జీవం తొలి దశకు రూ.7,345.12 కోట్లతో అనుమతులు తీసుకున్నట్లు వివరించారు. 20 టీఎంసీల గోదావరి జలాలు తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీని ట్రై కార్పొరేషన్లుగా విభజించుకున్నామని, అన్ని సంస్థలు సమన్వయంతో పని చేసేలా చట్టబద్ధ వ్యవస్థగా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

సీఎం అధ్యక్షతన క్యూర్ అత్యున్నత పాలక మండలి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహానగరపాలిక చట్టంలో సెక్షన్లు తగ్గించే ప్రణాళిక చేస్తున్నామన్నారు. మురుగునీటిని శుద్ధి చేసి పునర్వినియోగం చేసే దిశగా యోచన చేస్తున్నట్లు చెప్పారు. చెట్ల పెంపకం, కాలుష్య నివారణకు వాడాలనే ప్రభుత్వ ఆలోచనలు ఉన్నాయని, హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# సంపాదకీయం
# మొహం చాటేసిన వర్షాలు!

ఈ ఏడాది ఇప్పటివరకు వర్షాభావ పరిస్థితులే ఏర్పడ్డాయి. ఆయా ప్రాంతాల్లో అక్కడక్కడ చెదురుముదురు వర్షాలు మినహా ఎక్కడా అనుకున్న స్థాయిలో వర్షాలు కురవలేదు. మరోవైపు వర్షాకాలం చివరికి వస్తున్న కొద్దీ దేశంలోని రైతన్నల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వాతావరణ శాఖ వెల్లడించిన తాజా అంచనాల ప్రకారం.. సెప్టెంబర్ మూడో వారం నుంచి దేశవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'ఎల్ నినో' ప్రభావం రబీ పంటల సాగుపై తీవ్ర ముప్పుగా పరిణమించేలా ఉంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బీహార్ వంటి పలు రాష్ట్రాల్లో సాధారణం కంటే 27 నుంచి 45 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ముగిసే సమయానికి వర్షాలు మొహం చాటేస్తే.. వచ్చే శీతాకాలంలో వేసే రబీ పంటల పరిస్థితి ఏంటనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. సాధారణంగా రబీ సీజన్ అక్టోబర్ నుంచి ప్రారంభమవుతుంది. సెప్టెంబర్‌లో వర్షాలు పడకపోయినా విత్తనాలు వేసే సమయం మారకపోవచ్చు కానీ, నేలలో తేమ శాతం దారుణంగా పడిపోతుంది. ప్రస్తుతం దేశంలోని 178 ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు గత ఏడాదితో పోలిస్తే దాదాపు 20 శాతం తగ్గిపోయాయి. గతేడాది ఇదే సమయానికి 163.44 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు ఉండగా, ఇప్పుడు అది 130.55 బిలియన్ క్యూబిక్ మీటర్లకు పరిమితమైంది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్ , మధ్యప్రదేశ్ వంటి వ్యవసాయ ఆధారిత రాష్ట్రాల్లో నీటి నిల్వలు లేకపోతే విత్తనాలు మొలకెత్తడమే కష్టమవుతుంది. భారతీయ వ్యవసాయంలో రబీ కాలం చాలా కీలకమైనది. ముఖ్యంగా నీటి లభ్యత , నేలలోని తేమపై ఆధారపడే గోధుమ, ఆవాలు, శనగ పంటలు ఈసారి తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయి. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో గోధుమలు, ఆవాల సాగు ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ మొదటి తడికి రిజర్వాయర్ నీళ్లే ఆధారం. మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్‌లోని నల్లరేగడి నేలల్లో వేసే శనగ పంట కేవలం భూమిలోని తేమ ఆధారంగానే పెరుగుతుంది. వర్షాలు లేక భూమి ఎండిపోతే ఈ పంటల దిగుబడి దారుణంగా పడిపోతుంది. ఎల్ నినో వల్ల ఏర్పడే కరవు పరిస్థితులను అధిగమించడానికి 'ఇండియన్ ఓషన్ డైపోల్' కాస్త ఆశాకిరణంగా కనిపిస్తోందని నిపుణులు చెప్తున్నారు. హిందూ మహాసముద్రంలో ఏర్పడే ఈ సానుకూల మార్పు వల్ల భారత్ వైపు వర్షపు మేఘాలు తొలకరిచ్చే అవకాశం ఉంది. 1997, 2023 సంవత్సరాల్లో ఎల్ నినో తీవ్రతను ఈ ఐఓడీ కొంతవరకు తగ్గించగలిగింది. అయితే, ఇది ప్రధానంగా వర్షాకాలానికే పరిమితమవుతుంది కాబట్టి, ఎండిపోయిన భూగర్భ జలాలను, ఖాళీ అయిన రిజర్వాయర్లను ఎంతవరకు నింపుతుందనేది అనుమానంగానే ఉంది. ఒకవేళ అక్టోబర్, నవంబర్ నెలల్లో భూమిలో తేమ శాతం పెరగకపోతే రబీ పంటల విస్తీర్ణం తగ్గడమే కాకుండా దిగుబడులు కూడా దెబ్బతింటాయి. దీనివల్ల రాబోయే రోజుల్లో గోధుమలు, పప్పు ధాన్యాలు, వంటనూనెల సరఫరా తగ్గి, నిత్యావసర ధరలు మళ్లీ ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం రైతుల ఆదాయాన్నే కాకుండా, సామాన్య ప్రజల జేబులకు కూడా పెద్ద కన్నం వేసేలా కనిపిస్తోంది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా కరవు తాండవిస్తోంది. ఓవైపు వర్షాధార పంటల సాగును చాలా వరకు తగ్గించినప్పటికీ మరోవైపు బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేసిన వరి సైతం చేతికందేలా లేదు. భూగర్భజలాలు దారుణంగా పడిపోయి, బోర్లు వట్టిపోతున్నాయి. ఎండిపోతున్న పంటలను చూడలేక అన్నదాతలు బావుల్లో పూడిక తీయిస్తూ కొత్త బోర్లు వేయిస్తున్నా చుక్క నీరు పడటం లేదు. ఈ వర్షాభావ పరిస్థితులు మరో వారం, పదిరోజుల పాటు కొనసాగితే పంటలపై ఆశలు వదిలేసుకోవాల్సిందేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో సాధారణంగా 1.32 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో సాగు నమోదయ్యేది. కానీ ఈ ఏడాది 1.21 కోట్ల ఎకరాలు అంటే సుమారు 92 శాతం మేరకే సాగు చేసినట్లు వ్యవసాయశాఖ గణాంకాలు నివేదిస్తున్నాయి. ప్రధానంగా 66 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు నమోదవుతుండగా ఈసారి 52.81 లక్షల ఎకరాల్లో(80 శాతం) మాత్రమే నాట్లు పడ్డాయి. ఇక పత్తి అంచనా సాగు 47 లక్షల ఎకరాలకు గాను 48 లక్షల ఎకరాల్లో సాగు నమోదైంది. 6.49 లక్షల ఎకరాల విస్తీర్ణంలో అపరాలు సాగవుతుండగా 7.86 లక్షల ఎకరాలకు చేరింది. అధికంగా నీటి ఆధారమైన వరి సాగు 20 శాతం వరకు తగ్గింది. కానీ చాలా ప్రాంతాల్లో నాట్లు వేసిన రైతులు మాత్రం పంటను కాపాడుకోడానికి ఎన్నో పాట్లు పడుతున్నారు. రాష్ట్రంలో ఈ సీజన్?కు సంబంధించి ఇప్పటిదాకా 49 రోజులే వర్షం కురిసింది. 598.9 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను 478.2 మి.మీ మాత్రమే కురిసింది. మొత్తంగా 20 శాతం లోటు వర్షపాతం ఏర్పడగా 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. తక్కిన 18 జిల్లాల్లో లోటు వర్షపాతమే కొనసాగుతోంది. జనగామ, వరంగల్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం,జోగులాంబ గద్వాల, సూర్యాపేట, ఖమ్మం, యాదాద్రిభువనగిరి,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో దాదాపు 40శాతం లోటులో కొనసాగుతుండటం గమనార్హం. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో భూగర్భ జలమట్టం దాదాపు 2 మీటర్లకు పైగా పడిపోయింది. గత సంవత్సరం ఆగస్టు చివరి నాటికి 5.78 మీటర్ల లోతులో ఉన్న నీటిమట్టం ఇప్పుడు 7.87 మీటర్లకు పడిపోవడం గమనార్హం. జిల్లాల వారీగా చూస్తే సూర్యాపేట, వికారాబాద్ జిల్లాల్లో గతంతో పోలిస్తే అదనంగా 5 మీటర్ల మేర నీటిమట్టం తగ్గింది. నారాయణపేట, మహబూబ్‌నగర్, మేడ్చల్ జిల్లాల్లో 4 మీట ర్లు, అలాగే వరంగల్, సంగారెడ్డి, రంగారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో 3మీటర్లకు లోతులోకి నీటి మట్టాలు పడిపోయాయి. వర్షాలు కురవక, సాగునీరు లేక అన్న దాతలు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. చెరువుల్లో నీటిని బయటకు తోడేందుకు మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండలం లోని పుల్గర్ల గ్రామంలో ఉన్న కొత్త చెరువు పరిధిలో 50 ఎకరాలకు పైగా ఆయకట్టు సాగయ్యేది. నీటి వసతి ఉన్న కొందరు రైతులు అక్కడక్కడా సుమారు ఐదు ఎకరాలవరకు వరిసాగు చేశారు. మిగిలిన పొలాలు మాత్రంబీళ్లుగా ఉండిపోయాయి. ఆయకట్టు చివరన ఉన్న పంటలకు నీరందించేందుకు చెరువులో ఉన్న కొద్దిపాటి నీటిని తోడేందుకు రైతులు మోటార్లను ఏర్పాటు చేశారు. ఇలాంటి పరిస్థితులే మున్ముందు కొన సాగితే సాగునీటికేకాదు తాగునీటికి కూడా ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## నా డ్యాన్స్‌తో ఉన్న ఏఐ వీడియో చూసి ఆశ్చర్యపోయా

### మోహన్‌లాల్, విజయ్ కంటే నేనే మంచి డ్యాన్సర్

### కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ సరదా వ్యాఖ్య

**అమరావతి,సెప్టెంబర్ 12 :** కేఎస్ఈబీ ఉద్యోగులతో కలిసి తాను నృత్యం చేస్తున్నట్లుగా ఉన్న ఒక కృత్రిమ మేధ (ఏఐ) వీడియోను చూసి దిగ్భ్రాంతికి గురయ్యానని కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ అన్నారు. అయితే, ఆ టెక్నాలజీ పుణ్యమా అని తాను ప్రముఖ నటులు మోహన్‌లాల్, సీఎం విజయ్ కంటే మెరుగ్గా డ్యాన్స్ చేశానని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. శనివారం కేరళ జ్యుడీషియల్ అకాడమీ, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ సంయుక్తంగా నిర్వహించిన సెమినార్‌లో సతీశన్ ప్రసంగించారు. సినిమా, సంగీత రంగాల్లో కాపీరైట్ హక్కుల పరిరక్షణ, డిజిటల్ టెక్నాలజీ సవాళ్లు అనే అంశంపై ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తన అనుభవాన్నే ఉదాహరణగా చూపుతూ, “ఆ వీడియో చూసి నేను షాక్ అయ్యాను. అందులో నేను మోహన్‌లాల్, విజయ్ కంటే బాగా డ్యాన్స్ చేస్తున్నట్లు అనిపించింది” అని సాంకేతిక పరిజ్ఞాన వేగానికి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కేరళ తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటూ, ప్రభుత్వంపై విమర్శలు వస్తున్న సమయంలో ఈ ఏఐ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇటీవల విడుదలైన 'జైలర్ 2' చిత్రంలోని 'అల బొలెలో' పాటకు సతీశన్, కేఎస్ఈబీ ఉద్యోగులు డ్యాన్స్ చేస్తున్నట్లు ఈ వీడియోను రూపొందించారు. కేవలం వినోదం కోసమే దీనిని రూపొందించామని, ఎవరినీ అవమానించే ఉద్దేశం లేదని క్రియేటర్లు స్పష్టం చేశారు. పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ వీడియోను కోటి మందికి పైగా వీక్షించడం విశేషం. ఈ వీడియోపై నెటిజన్లు స్పందిస్తూ విద్యుత్ కోతలపై ప్రభుత్వంపై, కేఎస్ఈబీపై విమర్శలు గుప్పిస్తున్నారు. రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభానికి అతీంద్రియ శక్తులేమీ కారణం కాదని, రాత్రిపూట వినియోగం పెరగడమే ప్రధాన కారణమని మంత్రి సన్నీ జోసెఫ్ పేర్కొన్న తరుణంలో సతీశన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# భవిష్యత్ టెక్నాలజీ హబ్‌గా అమరావతి

- ఆరోగ్యకర సమాజ నిర్మాణమే ధ్యేయం
- జనవరి 1 నుంచి హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్
- 49 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాకులు, పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లు
- విజయవాడ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన



**అమరావతి,సెప్టెంబర్ 12 :** వైద్యారోగ్య రంగంలో ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగించడం ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో జనవరి 1వ తేదీ నుంచి ప్రజల ఆరోగ్య రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేస్తున్నామని, ఇది వైద్య రంగంలో ఒక గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని ప్రకటించారు. అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటం బయో వ్యాలీని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి, తగిన సహకారం అందించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో వైద్యారోగ్య రంగం కొత్త పుంతలు తొక్కుతోందని అన్నారు. శనివారం విజయవాడలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు వైద్యారోగ్య శాఖకు చెందిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీని వారు సందర్శించి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన సభలో రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అదనంగా 500 క్రిటికల్ కేర్ బెడ్లు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్, కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ సేవలు కూడా ప్రజలకు చేరువ కానున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఏర్పడిన డబుల్ ఇంజన్ ప్రభుత్వం వల్లే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు. గత 12 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కొనియాడారు. దేశంలో మెడికల్ సీట్లను 51 వేల నుంచి రెట్టింపు చేశారని, కోవిడ్ సమయంలో ప్రపంచానికే వ్యాక్సిన్ అందించి భారత్ సత్తా చాటారని గుర్తుచేశారు. మంగళగిరి ఎయిమ్స్‌ను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని, జన ఔషధి కేంద్రాల ద్వారా పేదలకు తక్కువ ధరకే మందులు అందుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఫార్మా రంగం దేశానికే తలమానికంగా ఉందని, మెడ్‌టెక్ పార్కు ద్వారా వైద్య పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని వివరించారు. ఆహారపు అలవాట్లను మార్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సీఎం సూచించారు. “వంటశాలనే ఫార్మసీగా, ఆహారాన్నే ఔషధంగా” భావించాలని పిలుపునిచ్చారు. యోగా, ప్రాణాయామం వంటి సంప్రదాయ పద్ధతులను పాటిస్తూనే, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. వైద్యారోగ్య రంగానికి నిధులు కేటాయిస్తున్న ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర సహకారం, రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలుపుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. 'హెల్తీ-వెల్తీ-హ్యాపీ ఆంధ్రప్రదేశ్' నిర్మాణమే తమ ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు. అమరావతిని భవిష్యత్ సాంకేతికతకు చిరునామాగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు వివరించారు. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్‌ను అమరావతిలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అమరావతి గురించి లద్దాఖ్‌లో కూడా చర్చించుకునే పరిస్థితి వచ్చిందని, భవిష్యత్తులో ప్రపంచమంతా అమరావతి వైపు చూస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమ, సోము వీర్రాజు సహా పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం ప్రసంగం సందర్భంగా ప్రధాని మోదీ, అమరావతి, సంజీవని ప్రాజెక్టుల గురించి ప్రస్తావించినప్పుడు సభికులు, వైద్య విద్యార్థులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం ముగిశాక సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి నడ్డాతో కలిసి వేదికపై నుంచే సెల్ఫీ తీసుకుని సభికులను ఉత్సాహపరిచారు.

## మరో వారం రోజుల పాటు వర్షాలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :** తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లా ల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఎవరికైనా ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు.

## బాబుతో నడ్డా మర్యాదపూర్వక భేటీ

**అమరావతి, సెప్టెంబర్ 12 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. శనివారం ఉదయం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అమరావతికి విచ్చేసిన కేంద్ర మంత్రి నడ్డాను సీఎం చంద్రబాబు తన నివాసానికి ఆహ్వానించారు. సీఎం నివాసానికి చేరుకున్న జేపీ నడ్డాకు చంద్రబాబు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు కొద్దిసేపు ముచ్చటించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై సాధారణంగా చర్చించుకున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇది పూర్తిగా మర్యాదపూర్వక సమావేశమేనని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. కేంద్రంలో, రాష్ట్రంలో మిత్రపక్ష ప్రభుత్వాలు కొలువుదీరిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర మంత్రుల మధ్య ఇలాంటి సమావేశాలు జరగడం సాధారణమే. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు జేపీ నడ్డా ఆయన నివాసానికి వెళ్లారు. అధికారిక కార్యక్రమాల నిమిత్తం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రితో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. అంతకుముందు, విజయవాడలో శనివారం జరిగిన కార్యక్రమంలో జేపీ నడ్డా, చంద్రబాబు కలిసి రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల విలువైన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే ఇలాంటి అభివృద్ధి సాధ్యమని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు.

# కోర్ అర్బన్ రీజియన్ 2026 బిల్లు

### హైదరాబాద్‌కు క్యూర్-2026 చట్టం

### ఇక బిల్లు ఆమోదమే తరువాయి

**హైదరాబాద్, సెప్టెంబర్ 12:** హైదరాబాద్ మహా నగరంలో వేర్వేరు సంస్థలు, వ్యవస్థలతో అస్తవ్యస్తంగా మారిన పరిపాలనను చక్కదిద్దడమే లక్ష్యంగా క్యూర్(కోర్ అర్బన్ రీజియన్)-2026 బిల్లును ప్రభుత్వం శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టింది. ఒకే నగరం, ఒకే పరిపాలన, ఒకే చట్టం నినాదంతో ఈ బిల్లు రూపుదిద్దుకుంది. జీహెచ్ఎంసీ-1955 చట్టం స్థానంలో ప్రభుత్వం ఈ క్యూ ర్ బిల్లు-2026ను ప్రతిపాదించింది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీలకు ఈ చట్టం వర్తిస్తుంది. ఇందులో ఐదు భాగాలు, 43 చాప్టర్లు, 319 సెక్షన్లు, 9 షెడ్యూళ్లు ఉన్నాయి. సీఎం ఛైర్మన్‌గా క్యూర్ పరిధికి అత్యున్నత పరిపాలన మండలి, కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి, మరో పది రకాల కమిటీలు ఈ చట్టంలో ఉంటాయి. జీహెచ్ఎంసీ చట్టంలో మాదిరి పరిపాలనలో నగర పాలక సంస్థనే పరిమితం చేయకుండా పోలీసు, హైడ్రా, జలమండలి వంటి ఇతర శాఖలను ఇందులో భాగస్వామ్యం చేసింది. అక్రమ నిర్మాణాల కట్టడికి జరిమానా, కూల్చివేత, సీజ్ చేయడం, సౌకర్యాల నిలిపివేత అనే నాలుగు రకాల చర్యలు ఇందులో ఉంటాయి. సెక్షన్ 94 ప్రకారం అనుమతిలేని భవన నిర్మాణాలు ఉంటే ఆస్తిపన్నుపై 100 శాతం నుంచి 300 శాతం జరిమానా పడుతుంది. భవనం వినియోగాన్ని మార్చినా ఫైన్ విధిస్తారు. అనుమతి లేని భవనాలకు జీహెచ్?ఎంసీ కమిషనర్ నోటీసు ఇచ్చిన 15 రోజుల్లో చర్యలు ఉంటాయి. అనుమతిలేని భవనాన్ని యజమాని స్వయంగా కూల్చుకోవాల్సి ఉంటుంది. లేదంటే బల్దియా కూల్చి ఖర్చును ఆస్తిపన్నులో జమచేస్తుంది. ప్రజల భద్రత దృష్ట్యా మున్సిపల్ అధికారులు నోటీసు లేకుండానే భవనాన్ని సీజ్ చేసే అధికారం ఉంది. నివాసయోగ్యపత్రం లేకపోతే భవనానికి కరెంటు, తాగునీరు, మురుగునీటి కనెక్షన్లు మంజూరు చేయకూడదు. అక్రమ నిర్మాణాల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని, రిజిస్ట్రేషన్ల చట్టంలోని సెక్షన్ 22ఏ(1)(ఏ) కింద నిషేధిత జాబితాలో చేర్చాలని ముసాయిదా బిల్లు చెబుతోంది. ఆయా కేసుల్లో ప్రజలు బాధితులుగా మారితే జీహెచ్?ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో విచారణ జరిపి న్యాయం చేస్తారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నిర్ణయాలు, నోటీసులను 30 రోజుల్లో ప్రజలు సవాల్? చేయవచ్చు. ప్రభుత్వం క్యూర్ అప్పిలేట్ అథారిటీని కూడా ఏర్పాటు చేస్తుంది. ఛైర్‌పర్సన్, ఇద్దరి నుంచి నలుగురు పూర్తిస్థాయి సభ్యులతో సివిల్ కోర్టు అధికారాలతో ఈ అథారిటీ విధులు నిర్వహిస్తుంది. సభ్యులను ప్రభుత్వం, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శితో కూడిన సెలక్షన్ కమిటీ నియమిస్తుంది. క్యూర్ పరిధిలోని 3 కార్పొరేషన్లకు ఒకే వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా పౌర సేవలను అందించాలని అన్ని రకాల పర్మిషన్లు, పన్ను, రుసుముల చెల్లింపునకు సదుపాయం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. భవిష్యత్తులో ఇతర ప్రభుత్వ శాఖల రుసుముల చెల్లింపు సదుపాయాన్ని కూడా క్యూర్ ఆన్‌లైన్ పోర్టల్‌లో చేర్చాల న్నది ప్రతిపాదన. హైదరాబాద్‌లోని అన్ని భవనాలకు ప్రాపర్టీ ఐడెంటిటీ కోడ్, అపార్ట్‌మెంట్ల విషయంలో ఫ్లాట్లకు సబ్ ఐడెంటిటీ కోడ్‌ను ఇవ్వాలన్నది బిల్లులోని ప్రతిపాదన. ఆయా గుర్తింపు సంఖ్యతో ప్రజలు తమ ఆస్తి వివరాలు, నీటి బిల్లు, దానికి సంబంధించిన పన్ను, కరెంటు బిల్లు, ఇతరత్రా ఛార్జీలను చెల్లించుకునే వెసులుబాటు కల్పిస్తారు. క్యూర్ బిల్లుపై ప్రభుత్వం ఈ ఏడాది జులై 4వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు, అభిప్రాయాలు స్వీకరించింది.

# భారత్, చైనా కలిసి నడవాలి

### భారత ప్రధాని మోదీ ద్వైపాక్షిక భేటీ

### సరిహద్దు వివాదంపై ఇరువురు చర్చ

### ఏడేళ్ల తర్వాత జిన్‌పింగ్ పర్యటన

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 :** బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఢిల్లీకి వచ్చిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భారత మండపంలో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. ఈ క్రమంలో సరిహద్దు వివాదం, వాణిజ్యం సహా పలు అంశాలపై ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో దీర్ఘకాలిక, వ్యూహాత్మక ఒప్పందాలు చేసుకుంటామని అన్నారు. అతిపెద్ద దేశాలుగా ఉన్న భారత్, చైనా కలిసి నడవాలని, అనేక విషయాల్లో పరస్పరం సహకరించుకోవాలని పిలుపుని చ్చారు. అలాగే, ఆధునిక టెక్నాలజీ సాయంతో వేగంగా పురోగతి సాధించాలని అభిప్రాయప డ్డారు. ద్వైపాక్షిక సంబంధాల దీర్ఘకాలిక అభివృద్ధిని వ్యూహాత్మక కోణంలో ఇరుపక్షాలు దృష్టిలో ఉంచుకోవడంతోనే చైనా-భారత్ సంబంధాలు అభివృద్ధి చెందాయి. చైనా, భారత్‌లు భిన్నమైనవి. అయినప్పటికీ ఉమ్మడి అభివృద్ధిని సాధించడానికి ఇరు దేశాలు పరస్పరం మద్దతు ఇచ్చుకున్నాయి. సహాయం చేసుకున్నాయి. ఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సుకు హాజరవడం, ప్రధాని మోదీని మరోసారి కలవడం నాకు చాలా ఆనందంగా ఉంది. భారత్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు విజయవంతమైనందుకు మోదీకి నా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. గత 12 ఏళ్లలో ఢిల్లీలో తాను పర్యటించడం ఇది రెండోసారని చైనా అధినేత షీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. అదే సమయంలో భారత ప్రధాని మోదీని ఇప్పటివరకు 21 సార్లు కలిశానని గుర్తు చేసుకున్నారు. తత్ఫలితంగా తమ ఇద్దరి మధ్య అనేక ముఖ్యమైన ఏకాభిప్రాయాలు కుదిరాయని స్పష్టం చేశారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాలుగా, గ్లోబల్ సౌత్‌లో సభ్యులుగా ఇరు దేశాల ఉమ్మడి స్థానాన్ని ఈ సందర్భంగా షీ జిన్‌పింగ్ హైలైట్ చేశారు. మానవాళి ఉమ్మడి భవిష్యత్తు కోసం చైనా, భారత్‌లకు ముఖ్యమైన బాధ్యతలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. చైనా, భారత్‌లు ఒకరి సామర్థ్యాల నుంచి మరొకరు నేర్చుకుంటూ, ఉమ్మడి అభివృద్ధిని సాధించగలవని అన్నారు.” భారత్, చైనాలు భిన్నమైన దేశాలు అయినప్పటికీ, ఉమ్మడి అభివృద్ధిని సాధించడానికి పరస్పరం మద్దతు ఇచ్చుకున్నాయి. చైనా, భారత్ ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాలు. అలాగే గ్లోబల్ సౌత్‌లో కీలకమైనవి. మానవాళికి ఉమ్మడి భవిష్యత్తు కోసం ఈ రెండు దేశాలపై కీలకమైన బాధ్యతలు ఉన్నాయి. నాణ్యమైన సహకారాన్ని ఇరుదేశాలు కొనసాగించాలి. మరింత సమానత్వం, సమ్మిళితత్వం, స్వేచ్ఛాయుతమైన, ఆర్థికంగా ఏకీకృతమైన ప్రపంచం కోసం కృషి చేయాలి. తద్వారా ప్రపంచ శాంతి, స్థిరత్వం, అభివృద్ధికి సానుకూల శక్తిని అందించాలి. ఇరు దేశాలు ఆధునిక టెక్నాలజీ సాయంతో వేగంగా పురోగతి సాధించాలి” అని షీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశం అనంతరం ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షత వహించిన భారత్‌కు చైనా అందించిన మద్దతు, సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. షీ జిన్‌పింగ్‌తో పలు అంశాలపై చర్చించానని వెల్లడించారు. నిర్మాణాత్మక చర్చలకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ప్రకటించారు. “మీకు (జిన్‌పింగ్‌ను ఉద్దేశించి) హృదయపూర్వక స్వాగతం పలకడం నాకు చాలా ఆనందంగా ఉంది. బ్రిక్స్ సదస్సులో మీరు చేసిన సానుకూల వ్యాఖ్యలకు ధన్యవాదా లు. బ్రిక్స్ సమిట్‌కు అధ్యక్షత వహించిన భారత్ కు చైనా అందించిన మద్దతు, సహకారానికి నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఇప్పుడు మనకు ద్వైపాక్షిక సహకారంపై చర్చించే అవకాశం లభించింది” అని మోదీ స్పష్టం చేశారు.

బలగం TV BALAGAM
రాజన్న సిరిసిల్ల కరీంనగర్ పెద్దపల్లి
balagamtv100@gmail.com



# ఘనంగా సిరిసిల్ల మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవం

## 16 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని సిరిసిల్ల మండల స్థాయిలో ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారి దూస రఘుపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి హాజరయ్యారు.

ఈ సందర్భంగా మండలంలోని 16 మంది ఉత్తమ ఉపాధ్యాయులను శాలువా, మెమెంటో, ప్రశంసాపత్రాలతో ఘనంగా సత్కరించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పలువురు వక్తలు కొనియాడారు. భావిభారత పౌరులను తీర్చిదిద్దే గురువుల సేవలు సమాజానికి ఎంతో విలువైనవని పేర్కొన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, జ్ఞానం, నైతిక విలువలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అభినందించారు. ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించడం ద్వారా వారి సేవలకు గుర్తింపు లభించడంతో పాటు, మరింత ఉత్సాహంతో పనిచేసేందుకు ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లకావత్ మోతిలాల్, లోకిని శారద, బైరి రవీందర్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# నెహ్రూనగర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో 414 మంది విద్యార్థులకు సమదుస్తుల పంపిణీ...

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్లలోని జిల్లా పరిషత్ హైస్కూల్ నెహ్రూనగర్‌లో 2026–27 విద్యాసంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన సమదుస్తులను విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న మొత్తం 414 మంది విద్యార్థినీ విద్యార్థులకు స్థానిక కౌన్సిలర్ ఎర్రం వెంకట్రాజం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గంగుల రుక్మిణి చేతుల మీదుగా స్కూల్ యూనిఫామ్‌లను అందజేశారు.

ఈ సందర్భంగా విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదువుతూ విద్యలో రాణించాలని సూచించారు. విద్యార్థులందరికీ సమదుస్తులు అందించడం ద్వారా పాఠశాలలో సమానత్వ భావన, క్రమశిక్షణ పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు గుత్తికొండ రాజశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ ఖాజామోహియోద్దీన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ..

**బలగం టీవీ, వేములవాడ:**

వినాయక చవితి పండుగను పురస్కరించుకుని సోమవారం వేములవాడ మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలను ప్రోత్సహిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితం కాకుండా, పర్యావరణానికి హాని కలగకుండా ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించాలని ఈ సందర్భంగా సూచించారు. పర్యావరణహితమైన వినాయక చవితి వేడుకలను నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# బతుకమ్మ ఘాట్ నిర్మాణానికి భూమిపూజ

**బలగం టీవీ, ఓదెల**

పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని ఊర చెరువు వద్ద బతుకమ్మ ఘాట్ నిర్మాణానికి సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ శనివారం భూమిపూజ చేశారు. మహిళలు ఆనందోత్సవాల మధ్య జరుపుకునే బతుకమ్మ పండుగకు సౌకర్యంగా ఉండేలా బతుకమ్మ మెట్లు, ఘాట్ నిర్మాణానికి పాలకవర్గం తీర్మానం చేసినట్లు సర్పంచ్ తెలిపారు. అనంతరం పాలకవర్గ సభ్యులతో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.

కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోపతి శ్రీలత-ప్రవీణ్, వార్డు సభ్యులు గొర్ల శ్రీనివాస్, దూలం సదానందం, రాపెల్లి రాజయ్య, చింతం విజయ-స్వామి, పెండం లక్ష్మీ-ఓదేలు, కొంగ్ర లక్ష్మణ్, తోట ఉమామహేశ్వరి, తీర్థాల శ్రీనివాస్, బుద్ధే కుమార్, నూతి శంకర్, మాట్లా కుమార్, బోడకుంట శివన్న, చెరుకు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఈపీ ఆపరేటర్ల సమస్యలు తీర్చకుంటే ఎన్నికల బహిష్కరణ

## సీపీఎస్‌ఏ హెచ్చరిక

**బలగం టీవీ, సింగరేణి**

సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తిలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న ఈపీ (ఎర్త్ మూవింగ్ పేలోడర్) ఆపరేటర్లు, డ్రైవర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే రాబోయే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో ఏ ఒక్క సంఘానికీ ఓటు వేసేది లేదని ఈపీ ఆపరేటర్స్ అసోసియేషన్ కేంద్ర అధ్యక్షుడు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ హెచ్చరిక చేశారు.

పదోన్నతుల్లో తీవ్ర కాలయాపన:

ఓపెన్ కాస్ట్ (ఓసీపీ) గనుల్లో రాత్రింబవళ్లు కష్టపడుతున్న ఈపీ ఆపరేటర్లను సింగరేణి యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. గ్రేడ్ల వారీగా రావాల్సిన పదోన్నతులను ఎప్పటికప్పుడు ఇవ్వకుండా తీవ్ర కాలయాపన చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ఈ విషయమై యాజమాన్యాన్ని నిలదీయాల్సిన గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలు పూర్తిగా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు.


అగ్రిమెంట్‌పై స్పష్టత ఏది?:

గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ (AITUC) తాము ఈపీ ఆపరేటర్ల కోసం అగ్రిమెంట్ చేసినట్లు చెబుతున్నప్పటికీ, దానికి సంబంధించిన ఎలాంటి అధికారిక సర్క్యులర్లలో ఇంతవరకు వెలువడలేదని శ్రీనివాస్ రెడ్డి ఎత్తిచూపారు. సమస్యల పరిష్కారానికి కార్మిక సంఘాలు చొరవ తీసుకోకపోతే, అసోసియేషన్ ఆధ్వర్యంలోనే ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని, ఎన్నికల బహిష్కరణ తప్పదని తేల్చి చెప్పారు.

# ఫోర్జరీ సంతకాలతో కళాశాల విక్రయం చేశారంటూ ఫిర్యాదు...

## శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాల వ్యవహారంపై పోలీసుల కేసు నమోదు..

**బలగం టీవీ, సిరిసిల్ల:**



సిరిసిల్ల పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాలను తమకు తెలియకుండా సొసైటీ పత్రాల్లో సంతకాలు ఫోర్జరీ చేసి ఇతరులకు విక్రయించారని ఆరోపిస్తూ కళాశాల నిర్వాహకుడు దిడ్డి శ్రీనివాస్ పోలీసులను ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై సిరిసిల్ల టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

దిడ్డి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. వెంకంపేటకు చెందిన ఆయన లెక్చరర్‌గా, వికాస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. మరికొందరితో కలిసి రాజరాజేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ (రిజిస్ట్రేషన్ నంబర్ 250/2001) ఆధ్వర్యంలో అనంతనగర్‌లో నిర్వహిస్తున్న పద్మశ్రీ జూనియర్ కళాశాలను 2004లో కొనుగోలు చేసినట్లు తెలిపారు. అనంతరం కళాశాల పేరును శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాలగా మార్చి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రస్తుతం సొసైటీకి తాను అధ్యక్షుడిగా, ఏ. శంకర్‌రావు ఉపాధ్యక్షుడిగా, గుగ్గిళ్ల జగన్‌గౌడ్ ప్రధాన కార్యదర్శిగా, గుగ్గిళ్ల శ్రీనివాస్ సహాయ కార్యదర్శిగా, గుగ్గిళ్ల శైలజ కోశాధికారిగా, ఏ. ప్రణిత, దిడ్డి రమ సభ్యులుగా ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కళాశాలకు సంబంధించిన లెక్కలు చూపించాలని 2024 ఏప్రిల్ 18 నుంచి ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ల జగన్‌గౌడ్‌ను కోరుతున్నప్పటికీ సరైన సమాధానం ఇవ్వలేదని శ్రీనివాస్ ఆరోపించారు. ఇతర సొసైటీ సభ్యులను ప్రశ్నించినా తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరించారని తెలిపారు.

దీంతో అనుమానం వచ్చి ఆరా తీయగా కళాశాలను విక్రయించిన విషయం తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను, తన భార్య దిడ్డి రమ కలిసి ప్రశ్నించగా కళాశాలను విక్రయించామని, తాము ఏం చేసుకుంటామో చేసుకోవచ్చని సమాధానం ఇచ్చినట్లు ఆరోపించారు. అధ్యక్షుడిగా తాను, సభ్యురాలిగా తన భార్య ఉన్న సొసైటీ ఆధ్వర్యంలోని కళాశాలను తమ అనుమతి, సంతకాలు లేకుండా ఎలా విక్రయిస్తారని ప్రశ్నించినా సరైన సమాధానం ఇవ్వలేదని శ్రీనివాస్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ వ్యవహారంపై 2024 డిసెంబర్ 10న ఇంటర్మీడియట్ బోర్డును సంప్రదించి సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించినట్లు శ్రీనివాస్ తెలిపారు. 2023 డిసెంబర్ 1న తమకు తెలియకుండా జనరల్ బాడీ సమావేశం నిర్వహించినట్లు పత్రాల ద్వారా తెలిసిందని పేర్కొన్నారు.

సొసైటీకి సంబంధించిన పత్రాల్లో సభ్యుల పేజీని మార్చి, తనతో పాటు తన భార్య దిడ్డి రమ సంతకాలను ఫోర్జరీ చేసి తప్పుడు పత్రాలు రూపొందించినట్లు ఆయన ఆరోపించారు. ఆ పత్రాలను ఉపయోగించి మోసపూరితంగా కళాశాలను ఇతరులకు బదలాయించారని ఆరోపిస్తూ సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలు, కళాశాల స్థలం, పత్రాలు, హక్కులు, లావాదేవీలకు సంబంధించిన అంశాలను పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసు పత్రాల ప్రకారం 2026 ఆగస్టు 27న రాత్రి 7 గంటలకు క్రైమ్ నంబర్ 298/2026గా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. బీఎన్ఎస్ సెక్షన్లు 318(4), 336(3), 340(2), 3(5) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

ప్రస్తుతం సంబంధిత పత్రాలు, సొసైటీ రికార్డులు, లావాదేవీల వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కళాశాల బదలాయింపులో ఎవరెవరి పాత్ర ఉంది? పత్రాల్లో ఉన్న సంతకాలు నిజమైనవేనా? ఆరోపణల్లో వాస్తవమెంత? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. దర్యాప్తులో భాగంగా సంబంధిత వ్యక్తుల నుంచి వివరాలు సేకరించి, పత్రాలను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# చిన్న గణపతులకు ముత్యాల అలంకరణ..





## 15 ఏళ్లుగా ఇంట్లోనే గణపతులకు ప్రత్యేక అలంకరణ..

## వ్యాపారుల నుంచి విశేష ఆదరణ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

వినాయక చవితి వచ్చిందంటే గణపతి విగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు చేయడం సాధారణమే. అయితే సిరిసిల్లలో ఓ కుటుంబం మాత్రం చిన్నచిన్న గణపతి విగ్రహాలకు ముత్యాలు, రంగురంగుల రాళ్లతో ప్రత్యేక అలంకరణ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

గత 15 ఏళ్లుగా ఈ కుటుంబం సోలాపూర్, నాందేడ్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి చిన్నచిన్న గణపతి విగ్రహాలను సిరిసిల్లకు తీసుకొస్తోంది. వినాయక చవితికి దాదాపు నెల రోజుల ముందుగానే విగ్రహాలను ఇంటికి తీసుకొచ్చి, కుటుంబ సభ్యులంతా కలిసి ఒక్కో గణపతిని ఎంతో శ్రద్ధగా తీర్చిదిద్దుతున్నారు. సాధారణంగా మార్కెట్‌లో కనిపించే చిన్న గణపతి విగ్రహాలకు తమదైన శైలిలో ముత్యాలు, రంగురంగుల రాళ్లు, వివిధ రకాల డెకరేషన్ వస్తువులతో అలంకరణ చేస్తున్నారు. దీంతో సాధారణంగా కనిపించే విగ్రహాలు కుటుంబ సభ్యుల చేతుల్లోకి వచ్చాక మరింత అందంగా, ఆకర్షణీయంగా మారుతున్నాయి.

చిన్న పరిమాణంలో ఉండటంతో పాటు ప్రత్యేకమైన అలంకరణతో ఆకట్టుకుంటుండటంతో వీటిని చిన్నచిన్న షాపులు, వ్యాపార సంస్థల్లో ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేసుకునేందుకు పలువురు కొనుగోలు చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇప్పటికే అలంకరించిన అనేక గణపతి విగ్రహాలను భక్తులు, వ్యాపారులు కొనుగోలు చేయగా.. మరికొన్ని విగ్రహాలకు బుకింగ్‌లు కూడా వచ్చినట్లు చెప్పారు. దీంతో మిగిలిన విగ్రహాలకు కూడా కుటుంబ సభ్యులంతా కలిసి ప్రత్యేక అలంకరణలు చేస్తూ సిద్ధం చేస్తున్నారు.

మార్కెట్‌లో సాధారణంగా కనిపించే చిన్న గణపతులకు ముత్యాలు, రంగురంగుల రాళ్లతో ప్రత్యేక రూపాన్ని తీసుకురావడం ఈ కుటుంబం ప్రత్యేకతగా నిలుస్తోంది. 15 ఏళ్లుగా తమ కళను కొనసాగిస్తూ వినాయక చవితి సందర్భంగా సిరిసిల్లలో ఈ కుటుంబం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. చిన్న గణపతులకే ఇంత అందమైన అలంకరణ చేయడం చూసిన భక్తులు, స్థానికులు ఆసక్తిగా తిలకిస్తూ అభినందిస్తున్నారు.





# నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు..



**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సినిమా థియేటర్ వద్ద స్థానిక ప్రజల విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులు తొలగి ప్రజలకు మెరుగైన విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది

ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ తమ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన నాయకులకు, విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగన్న మరియు స్థానిక సర్పంచ్ ఎనుగందుల నర్సింలు,సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, ఫ్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాహెరాబేగం-గౌస్, సర్పంచ్ దొమ్మటి నర్సయ్య, ఉపసర్పంచ్ బందారపు బాల్రెడ్డి, వార్డు మెంబర్స్ అంగూరి ప్రవీణ్,దొనుకుల రామచంద్రం, గోపాల్, సింగిల్ విండో డైరెక్టర్ నేవూరి వెంకట నర్సింహా రెడ్డి, గుండాడి వెంకట్ రెడ్డి, రాంరెడ్డి,వివిధ పార్టీ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం యుజిడి పనుల్లో భారీ అవినీతి

## సీబీఐ, ఈడీలకు సీపీఐ ఫిర్యాదు

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై ఘాటు విమర్శలు.. మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరిక

**బలగం టీవీ, రామగుండం**




రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ (యూజీడీ) పనుల్లో భారీ స్థాయిలో అవినీతి, అక్రమాలు జరిగాయని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)లకు ఫిర్యాదు చేసినట్లు సీపీఐ నాయకులు వెల్లడించారు. శనివారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామగుండం కార్పొరేషన్ సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య, నగర కార్యదర్శి కే. కనకరాజు మాట్లాడారు.

రూ. 16 కోట్ల స్టాంపు డ్యూటీ నిధుల మళ్లింపు:

కార్పొరేషన్‌కు వచ్చిన రూ. 16 కోట్ల స్టాంపు డ్యూటీ నిధులను నిబంధనలకు విరుద్ధంగా దారి మళ్లించి యూజీడీ పనులకు కేటాయించారని సీపీఐ నేతలు ఆరోపించారు. ఇతరులెవరూ టెండర్లు వేయకుండా కుట్ర పన్ని, కేవలం ఏడుగురు కాంట్రాక్టర్లకే ఈ ప్యాకేజీలను అప్పగించారని విమర్శించారు. సాధారణంగా రూ. 75 నుంచి రూ. 77 కే పూర్తి కావాల్సిన పనులను రూ. 99కి ఖరారు చేస్తూ, దాదాపు 22 శాతం నిధుల గోల్‌మాల్‌కు పాల్పడ్డారని వారు ఘాటుగా ఆరోపించారు. పనుల్లో ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

స్థానిక కాంట్రాక్టర్ల కడుపు కొడుతూ కమిషన్ల పర్వం:

రామగుండంలో స్థానిక కాంట్రాక్టర్లకు అవకాశం ఇవ్వకుండా, టెండర్లను హైదరాబాద్‌లోనే ఖరారు చేస్తూ 10 నుండి 12 శాతం కమిషన్లు దండుకుంటున్నారని స్థానిక ఎమ్మెల్యేపై ధ్వజమెత్తారు. "వెయ్యి రోజుల పాలనలో నీతి, నిజాయితీతో అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడమే తప్ప, రామగుండంలో మునుపెన్నడూ లేని రీతిలో అవినీతి రాజ్యమేలుతోంది. ప్రతి పనికి కమిషన్ ఫిక్స్ చేశాకే కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తున్నారు. 'రక్షకుడిగా ఉంటానన్న ఎమ్మెల్యే ప్రజలను రక్షించకపోయినా పర్లేదు కానీ దయచేసి భక్షించకండి'" అని ఎద్దేవా చేశారు.

బిల్లులు నిలిపివేయాలి - లేకుంటే ముట్టడి:

సీబీఐ, ఈడీలకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో రామగుండం మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. సదరు ఏడు ప్యాకేజీల కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని, నాణ్యతా ప్రమాణాలపై ఎంక్వైరీ వేసి బిల్లుల చెల్లింపును నిలిపివేయాలని కోరారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తాళ్లపల్లి మల్లయ్య, నగర నాయకులు శనిగరపు చంద్రశేఖర్, ఆసాల నవీన్, అబ్దుల్ కరీం, రాణవేణి సుధీర్ కుమార్, సాధుల శివ, పోతరాజు నాగరాజు, శనిగరపు తిరుమల తదితరులు పాల్గొన్నారు.

# మాజీ క్రికెటర్ శ్రీశాంత్ కు పితృ వియోగం

**తండ్రి సంతకుమారన్ నాయర్ కన్నుమూత**
**కొచ్చిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస.. నేడు అంత్యక్రియలు**

బలగం టీవీ, హైదరాబాద్



భారత మాజీ క్రికెటర్ ఎస్. శ్రీశాంత్ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన తండ్రి వి. సంతకుమారన్ నాయర్ (89) శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, కేరళలోని కొచ్చిలో గల లిసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాత్రి 9.44 గంటల సమయంలో కన్నుమూశారు.

స్వగ్రామానికి మృతదేహం తరలింపు:

సంతకుమారన్ నాయర్ స్వస్థలం కోతమంగలం సమీపంలోని మాథిరప్పిళ్లి. ప్రస్తుతం ఆయన భౌతికకాయాన్ని లిసీ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. విదేశాల్లో ఉన్న కుటుంబ సభ్యులు ఆదివారం చేరుకున్న అనంతరం, మృతదేహాన్ని కోతమంగలంలోని వారి స్వగృహానికి తరలించనున్నారు.

ఆదివారం సాయంత్రం అంత్యక్రియలు:

ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్వగృహంలో బంధువులు, స్నేహితులు, అభిమానుల చివరి చూపు కోసం భౌతికకాయాన్ని ఉంచనున్నారు. అనంతరం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ వర్గాలు వెల్లడించాయి.

సంతకుమారన్ నాయర్‌కు భార్య టి.ఎన్. సావిత్రీదేవి, కుమారులు దీపుసంత్, ఎస్. శ్రీశాంత్, కుమార్తెలు నివేదిత, దివ్య ఉన్నారు. వీరిలో శ్రీశాంత్ అక్క దివ్యను ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు మధు బాలకృష్ణన్ వివాహం చేసుకున్నారు. సంతకుమారన్ నాయర్ మృతి పట్ల పలువురు క్రీడా, సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.



# సర్వకాలాల అత్యుత్తమ కెప్టెన్‌గా ఎంఎస్ ధోనీ

**రాహుల్ ద్రవిడ్ ఎంపిక**
**'విన్నర్ స్టేస్ ఆన్' ఛాలెంజ్‌లో కోహ్లీ కంటే ఇమ్రాన్ ఖాన్‌కే ఓటు.. చివరకు ధోనీకే మొగ్గు**

బలగం టీవీ, హైదరాబాద్

అంతర్జాతీయ క్రికెట్‌లో ఆల్‌టైమ్ బెస్ట్ కెప్టెన్ ఎవరనే అంశంపై టీమిండియా మాజీ హెడ్ కోచ్, దిగ్గజ బ్యాటర్ రాహుల్ ద్రవిడ్ స్పందించారు. ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫో నిర్వహించిన ప్రత్యేక 'విన్నర్ స్టేస్ ఆన్ (Winner Stays On)' ఛాలెంజ్‌లో పాల్గొన్న ద్రవిడ్, పలువురు ప్రపంచ దిగ్గజ కెప్టెన్లను దాటుకుని చివరకు భారత మాజీ సారథి ఎంఎస్ ధోనీనే అత్యుత్తమ కెప్టెన్‌గా ఎంపిక చేశారు.

స్టీవ్ స్మిత్‌తో ప్రారంభమై పాంటింగ్, వా వరకు:

ఈ ఛాలెంజ్ తొలి రౌండ్లలో ద్రవిడ్ ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్‌కు ప్రాధాన్యమిచ్చారు. బెన్ స్టోక్స్, కేన్ విలియమ్సన్, అర్జున రణతుంగ, గ్రేమ్ స్మిత్, మైఖేల్ క్లార్క్, ఇయాన్ మోర్గాన్, ప్యాట్ కమిన్స్‌ల కంటే స్టీవ్ స్మిత్ మెరుగైన నాయకుడని చెప్పారు. అనంతరం రెండు వన్డే ప్రపంచ కప్‌లు (2003, 2007) అందించిన రికీ పాంటింగ్ రాకతో స్మిత్ వెనుకంజ వేయగా, అలన్ బోర్డర్‌ను దాటి వచ్చిన పాంటింగ్‌ను స్టీవ్ వా అధిగమించారు.

కోహ్లీ వర్సెస్ ఇమ్రాన్ ఖాన్ - ఊహించని మలుపు:

స్టీవ్ వా స్థానంలో టీమిండియా మాజీ సారథి విరాట్ కోహ్లీని ద్రవిడ్ ఎంచుకున్నారు. కెప్టెన్‌గా 213 మ్యాచ్‌ల్లో 135 విజయాలు అందించిన కోహ్లీ రికార్డును ఆయన గుర్తు చేసుకున్నారు. అయితే తర్వాతి రౌండ్‌లోనే కోహ్లీ కంటే పాకిస్తాన్ దిగ్గజం, 1992 ప్రపంచ కప్ విజేత ఇమ్రాన్ ఖాన్‌ను ద్రవిడ్ ఎంచుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. జట్టును నడిపించిన తీరు, సాధించిన విజయాల ప్రాతిపదికన ఇమ్రాన్‌కే తన ఓటు అని ద్రవిడ్ స్పష్టం చేశారు.

ఆల్‌టైమ్ గ్రేట్‌గా ధోనీకి పట్టం:

ఇప్పటికీ, తదుపరి రౌండ్‌లో ఎంఎస్ ధోనీకి ద్రవిడ్ జై కొట్టారు. టి20 ప్రపంచ కప్ (2007), వన్డే ప్రపంచ కప్ (2011), ఛాంపియన్స్ ట్రోఫీ (2013)లతో పాటు టెస్టుల్లో నంబర్-1 ర్యాంకును అందించిన ధోనీ నాయకత్వ పటిమను ద్రవిడ్ కొనియాడారు. చివరి రౌండ్‌లో రెండుసార్లు ప్రపంచ కప్ గెలిచిన వెస్టిండీస్ దిగ్గజం క్లైవ్ లాయిడ్ ఎదురైనప్పటికీ, ధోనీనే అత్యుత్తమ కెప్టెన్ అని రాహుల్ ద్రవిడ్ తేల్చి చెప్పారు.



# ఏపీఎల్ రెండో సీజన్‌కు 36 మంది భారత ఆర్చర్లు

బలగం టీవీ, హైదరాబాద్

ఆర్చరీ ప్రీమియర్ లీగ్ రెండో సీజన్‌లో 36 మంది భారత ఆర్చర్లు బరిలోకి దిగనున్నారు. అక్టోబర్ 8 నుంచి హైదరాబాద్‌లో జరిగే ఈ పోటీల్లో 10 దేశాలకు చెందిన 12 మంది అంతర్జాతీయ ఆర్చర్లు పాల్గొంటారు.

రికర్వ్ విభాగంలో దీపికా కుమారి, అతాను దాస్, బొమ్మదేవర ధీరజ్, కాంపౌండ్‌లో వెన్నం జ్యోతి సురేఖ, అభిషేక్ వర్మ, ఓజాస్ ప్రవీణ్ పోటీ పడనున్నారు. ఈసారి 15 మంది భారత ఆర్చర్లు తొలిసారి లీగ్‌లో పాల్గొంటున్నారు. 15 సెకండ్ల షాట్ క్లాక్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఆరు ఫ్రాంచైజీలు మిక్స్‌డ్ జెండర్ జట్లుగా రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో పోటీ పడతాయి. తొలి సీజన్‌లో రాజ్‌పుతానా రాయల్స్ విజేతగా నిలిచింది.

# ఆసియా క్రీడల జట్టు నుంచి తొలగింపుపై వుషూ క్రీడాకారిణి ఆవేదన

బలగం టీవీ, హైదరాబాద్



ఆసియా క్రీడల జట్టు నుంచి తొలగించడంపై వుషూ క్రీడాకారిణి దివ్యాంశి చౌదరి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ సమాఖ్య తనను మానసికంగా, శారీరకంగా వేధించిందని ఆరోపించారు. గాయం కారణంగా జట్టు నుంచి తొలగించినప్పటికీ, వైద్యులు పోటీలో పాల్గొనవచ్చని సూచించారని ఆమె పేర్కొన్నారు.

ఆగస్టు 22న విడుదలైన జట్టులో దివ్యాంశి పేరు ఉండగా.. మోకాలి ముందు క్రూసియేట్ లిగమెంట్ గాయంతో ఆమెను తప్పించి, రెండుసార్లు ఆసియా క్రీడల పతక విజేత నౌరెమ్ రోషిబినా దేవిని ఎంపిక చేశారు. అయితే తనను జట్టు నుంచి తొలగించే నిర్ణయం గురించి ముందుగా సమాచారం ఇవ్వలేదని దివ్యాంశి ఆరోపించారు.మరోవైపు వుషూ సంఘం మాత్రం వైద్య కారణాలతోనే దివ్యాంశిని తప్పించినట్లు స్పష్టం చేసింది. ఆగస్టు 23న నిర్వహించిన ఎంఆర్‌ఐలో తీవ్ర స్థాయి పాక్షిక లిగమెంట్ చీలిక, మోకాలి వద్ద అధిక ద్రవం ఉన్నట్లు తేలిందని తెలిపింది. క్రీడాకారిణి ఆరోగ్యం, భవిష్యత్ క్రీడా ప్రస్థానాన్ని దృష్టిలో ఉంచుకుని పోటీలు, పూర్తిస్థాయి శిక్షణకు దూరంగా ఉండాలని వైద్యులు సూచించినట్లు పేర్కొంది.

జూన్‌లో చైనాలో జరిగిన పోటీల్లోనే గాయమైనట్లు దివ్యాంశి తమకు తెలిపిందని సంఘం వెల్లడించింది. అయితే తనకు వైద్యుల నుంచి పోటీలో పాల్గొనే అనుమతి ఉందని దివ్యాంశి చెబుతూ.. ఆసియా క్రీడల్లో భారత్ తరఫున పాల్గొని పతకం సాధించాలన్న తన కలను అన్యాయంగా దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

# నేడే భారత్ - శ్రీలంక మహాపోరు




**స్పిన్ దళాల మధ్య ఆసియా కప్ టైటిల్ సమరం..**
**ఎనిమిదో ట్రోఫీపై భారత్ కన్ను**

బలగం టీవీ, హైదరాబాద్

మహిళల టీ20 ఆసియా కప్ 2026లోనేడుంగా ఆదివారం దుబాయ్ అంతర్జాతీయ స్టేడియంలో జరగనున్న ఫైనల్లో భారత్, శ్రీలంక జట్లు తలపడనున్నాయి. ఈ టోర్నీలో ఇరు జట్లు ఓటమి ఎరుగకుండా ఘనమైన విజయాలతో ఫైనల్‌కు చేరుకున్నప్పటికీ, అన్ని విభాగాల్లో సమతుల్యంగా ఉన్న టీమిండియా ఈ టైటిల్ సమరంలో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.

స్పిన్నర్ల హోరాహోరీ:

ఈ టోర్నీలో దుబాయ్ పిచ్‌లపై స్పిన్నర్లదే పైచేయిగా నిలిచింది. టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన జట్లలో భారత్ (26 వికెట్లు), శ్రీలంక (25 వికెట్లు) మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ, లంక కెప్టెన్ చమరి ఆటపట్టు చెరో 11 వికెట్లతో టోర్నీలోనే అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లుగా కొనసాగుతున్నారు. టీమిండియాకు దీప్తితో పాటు శ్రీ చరణి, ప్రేమ రావత్, పేసర్ నందని శర్మల రూపంలో బలమైన బౌలింగ్ విభాగం ఉంది.

జోరుమీదున్న భారత టాప్ ఆర్డర్:

భారత ఓపెనర్లు స్మృతి మందాన, షఫాలీ వర్మలు జట్టుకు నిలకడైన శుభారంభాలు అందిస్తున్నారు. ముఖ్యంగా షఫాలీ వర్మ 169.69 స్ట్రైక్ రేట్‌తో 168 పరుగులు చేసి టోర్నీ టాప్ స్కోరర్‌గా ఉండగా, స్మృతి మందాన కూడా హాంకాంగ్‌పై రికార్డు సెంచరీ సాధించి మంచి ఫామ్‌లో ఉంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్, ప్రతీకా రావల్‌లతో భారత బ్యాటింగ్ లైనప్ బలంగా ఉంది.

తిరగబడాలని చూస్తున్న డిఫెండింగ్ ఛాంపియన్ శ్రీలంక:

మరోవైపు శ్రీలంక బ్యాటింగ్ లైనప్ కొంత ఆందోళనకరంగా ఉంది. సెమీఫైనల్లో పాకిస్థాన్‌పై హర్షిత సమరవిక్రమ, కవిషా దిల్హారీ సమయోచితంగా రాణించి జట్టును గెలిపించారు. లంక కెప్టెన్ ఆటపట్టు బౌలింగ్‌లో అదరగొడుతున్నా, బ్యాటింగ్‌లో పెద్దగా రాణించలేకపోవడం ఆ జట్టుకు లోటే. అయితే 2024 ఆసియా కప్ ఫైనల్లో భారత్‌ను ఓడించి టైటిల్ నెగ్గిన జ్ఞాపకాలు లంకలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నాయి.

తుది జట్లు (అంచనా):

భారత్: స్మృతి మందాన, షఫాలీ వర్మ, ప్రతీకా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), రిచా ఘోష్ (వికెట్ కీపర్), భారతి ఫుల్మాలి, దీప్తి శర్మ, ప్రేమ రావత్, క్రాంతి గౌడ్, ఎన్ శ్రీ చరణి, నందని శర్మ.

శ్రీలంక: ఇమేషా దులానీ, చమరి ఆటపట్టు (కెప్టెన్), సంజన కవింది, హర్షిత సమరవిక్రమ, హసిని పెరెరా, కవిషా దిల్హారి, నీలాక్షి డి సిల్వా, కౌశని నుత్యంగనా (వికెట్ కీపర్), సుగంధిక కుమారి, చముడి ప్రబోధ, మిథాలి అయోధ్య.

# నేడే భారత్ - అఫ్గానిస్తాన్ తొలి టీ20 సమరం

**అరుణ్ జైట్లీ మైదానంలో పోరు..**
**జోష్‌లో టీమిండియా.. సంచలనంపై అఫ్గాన్ కన్ను**

బలగం టీవీ, హైదరాబాద్




అంతర్జాతీయ క్రికెట్‌లో ఉత్కంఠభరిత పోరుకు వేళయైంది. భారత్, అఫ్గానిస్తాన్ జట్ల మధ్య మూడు టి20ల సిరీస్‌లో భాగంగా ఆదివారం న్యూఢిల్లీలోని అరుణ్ జైట్లీ (ఫిరోజ్‌షా కోట్లా) మైదానంలో తొలి మ్యాచ్ జరగనుంది. బలాబలాల పరంగా టీమిండియా అత్యంత పటిష్టంగా కనిపిస్తుండగా, తమ ఐపీఎల్ అనుభవంతో భారత్‌కు గట్టి పోటీ ఇచ్చి సంచలనం సృష్టించాలని అఫ్గానిస్తాన్ పట్టుదలతో ఉంది. రాత్రి 7.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ మ్యాచ్ సోనీ స్పోర్ట్స్, సోనీ లివ్‌లలో ప్రత్యక్ష ప్రసారం కానుంది.

పూర్తి స్థాయి జట్టుతో టీమిండియా - బుమ్రాపైనే అందరి దృష్టి:

హార్దిక్ పాండ్యా మినహా భారత జట్టు పూర్తి స్థాయి రెగ్యులర్ ఆటగాళ్లతో బరిలోకి దిగుతోంది. ఇటీవల గాయం నుంచి కోలుకొని పునరాగమనం చేస్తున్న స్పీడ్‌స్టర్ జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌పై అందరి దృష్టి నెలకొంది. జింబాబ్వే సిరీస్ విజయం అందించిన ఉత్సాహంలో ఉన్న కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, అదే జోరును స్వదేశంలోనూ కొనసాగించాలని భావిస్తున్నాడు. దులీప్ ట్రోఫీలో రాణించిన ఇషాన్ కిషన్, తిలక్ వర్మలతో పాటు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లు జట్టుకు కొండంత బలాన్ని ఇస్తున్నారు.

ఓపెనింగ్ స్థానంపై తీవ్ర ఉత్కంఠ:

ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మతో పాటు రెండో ఓపెనర్‌గా ఎవరు దిగుతారనేది ఆసక్తికరంగా మారింది. వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శామ్సన్, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇద్దరూ ఫామ్‌లో ఉండటంతో తుది జట్టు ఎంపిక మేనేజ్‌మెంట్‌కు సవాలుగా మారింది.

రషీద్ ఖాన్ సేన సవాలు:

భారత పిచ్‌లపై అఫ్గానిస్తాన్ ఆటగాళ్లకు పూర్తి అవగాహన ఉంది. కెప్టెన్ ఇబ్రహీమ్ జద్రాన్ నేతృత్వంలోని అఫ్గాన్ జట్టులో రషీద్ ఖాన్, గుర్బాజ్, నబీ, అజ్మతుల్లా, ముజీబ్, నూర్ అహ్మద్ వంటి ప్రముఖ ఐపీఎల్ స్టార్స్ ఉన్నారు. ముఖ్యంగా టి20ల్లో రషీద్ ఖాన్ స్పిన్ ధాటిని ఎదుర్కోవడం భారత బ్యాటర్లకు కీలక పరీక్ష కానుంది.

టి20ల్లో భారత్‌దే పైచేయి:

ఇప్పటివరకు భారత్, అఫ్గానిస్తాన్ మధ్య 9 టి20 మ్యాచ్‌లు జరగ్గా టీమిండియా 7 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. ఒక మ్యాచ్ టై అవ్వగా, మరొకటి వర్షం కారణంగా రద్దయింది. అంతర్జాతీయ క్రికెట్‌లో అఫ్గానిస్తాన్ ఇప్పటివరకు ఓడించని ఏకైక దిగ్గజ జట్టు భారతదేశమే కావడం గమనార్హం.

తుది జట్ల వివరాలు (అంచనా):

భారత్: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శామ్సన్ / వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి.

అఫ్గానిస్తాన్: ఇబ్రహీమ్ జద్రాన్ (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్, గుల్బదిన్ నైబ్, సాదిఖుల్లా అటల్, దార్విష్ రసూలీ, అజ్మతుల్లా ఒమర్‌జాయ్, మహ్మద్ నబీ, రషీద్ ఖాన్, ముజీబ్ ఉర్ రహమాన్, నూర్ అహ్మద్, ఫజల్‌హక్ ఫారూఖీ / నవీన్ ఉల్ హక్.

# సచిన్, రహానేలకు అరుదైన గౌరవం

**వాంఖడే లాంజ్‌లకు వీరి పేర్లు**
**వార్షిక సమావేశంలో ఎంసీఏ కీలక నిర్ణయం..**

బలగం టీవీ, ముంబై:



భారత దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్, ఇటీవలే వీడ్కోలు పలికిన అజింక్యా రహానేలకు ముంబై క్రికెట్ సంఘం (MCA) మరో అరుదైన గౌరవాన్ని ప్రకటించింది. ప్రసిద్ధ వాంఖడే స్టేడియంలోని లాంజ్‌లకు (విశ్రాంతి గదులకు) వీరి పేర్లు పెట్టాలని ఎంసీఏ శుక్రవారం నిర్వహించిన వార్షిక సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించింది.

ముగ్గురు దిగ్గజాల పేర్లతో లాంజ్‌లు:

టీమిండియాకే కాకుండా ముంబై క్రికెట్‌కు అందించిన అతులిత సేవలను గుర్తించి సచిన్ టెండూల్కర్, అజింక్యా రహానేలతో పాటు ముంబై రంజీ జట్టు మాజీ కెప్టెన్, దివంగత మాధవ్ మంత్రి పేరును కూడా మరొక లాంజ్‌కు ఖరారు చేశారు.

మూడు సభ్యుల కమిటీ ఏర్పాటు:

సచిన్, రహానే, మాధవ్ మంత్రుల పేర్లను ఏయే లాంజ్‌లకు కేటాయించాలి, వాటిని ఎలా తీర్చిదిద్దాలి అనే అంశాలను పరిశీలించే బాధ్యతను ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీకి అప్పగించినట్లు ఎంసీఏ అధ్యక్షుడు అజింక్యా నాయక్ వెల్లడించారు. ఎంసీఏ ఉపాధ్యక్షుడు జితేంద్ర అవ్హాద్, అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు మిలింద్ నర్వేకర్, సలహాదారుడు ఉజ్వల్ నికమ్‌లు ఈ కమిటీలో సభ్యులుగా వ్యవహరించనున్నారు.

క్లబ్‌లకు రూ. 100 కోట్ల కేటాయింపు:

ముంబై క్రికెట్ అభివృద్ధికి తోడ్పడుతున్న అనుబంధ క్రికెట్ క్లబ్‌లకు రిజర్వ్ ఫండ్‌గా ఏకంగా రూ. 100 కోట్లు కేటాయించాలని ఎంసీఏ వార్షిక సర్వసభ్య సమావేశంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది.

# క్రీడా సాంకేతికతపై వర్కింగ్ గ్రూప్‌కు బ్రిక్స్ మద్దతు

బలగం టీవీ, ముంబై:




క్రీడా సాంకేతికతపై వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు, క్రీడా వస్తువుల తయారీదారుల సదస్సు నిర్వహించాలన్న భారత్ ప్రతిపాదనలకు బ్రిక్స్ మద్దతు తెలిపింది. సామాజిక అభివృద్ధికి క్రీడలు కీలక సాధనమని పేర్కొంటూ శనివారం విడుదల చేసిన న్యూఢిల్లీ ప్రకటనలో ఈ మేరకు వెల్లడించింది.

విశాఖపట్నంలో గత నెల జరిగిన బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశంలో కేంద్ర క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవీయ ఈ ప్రతిపాదనలు చేశారు. క్రీడా సాంకేతికతపై వర్కింగ్ గ్రూప్ ఏర్పాటైతే క్రీడా శాస్త్రం, క్రీడాకారుల ప్రదర్శన, పాలన, కృత్రిమ మేధ, డిజిటల్ మార్పులు, ఆవిష్కరణల్లో సభ్య దేశాల మధ్య సహకారం పెరుగుతుందని కేంద్ర క్రీడల శాఖ తెలిపింది.

క్రీడా వస్తువుల తయారీదారుల సదస్సును నవంబర్‌లో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సాంకేతికత, ఆవిష్కరణల మార్పిడితోపాటు తయారీదారులు, ఎగుమతిదారులు, పెట్టుబడిదారులు, సాంకేతిక సంస్థలు, అంకుర సంస్థలు, పరిశోధనా సంస్థలను ఈ సదస్సు ఒకచోటకు తీసుకురానుంది.

బ్రిక్స్ క్రీడా వర్కింగ్ గ్రూప్ పురోగతిని ప్రకటనలో ప్రశంసించారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం, ప్రజల మధ్య సంబంధాల బలోపేతంలో క్రీడల పాత్రను గుర్తించారు. 2017లో ప్రారంభమైన బ్రిక్స్ క్రీడలు కొవిడ్ కారణంగా 2019–2021 మధ్య నిలిచిపోయాయి. 2022లో తిరిగి ప్రారంభమై, చివరి క్రీడలు 2024లో రష్యాలోని కజాన్‌లో జరిగాయి. సభ్య దేశాల వైవిధ్యాన్ని చాటే వేదికగా బ్రిక్స్ క్రీడలు కొనసాగుతున్నాయని ప్రకటన పేర్కొంది.

# పాకిస్తాన్‌ను ఊడ్చేసిన ఇంగ్లాండ్

**మూడో టెస్టులో ఘన విజయం**
**3-0తో సిరీస్ క్లీన్ స్వీప్..**
**డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానం మరింత భద్రం**

బలగం టీవీ, హైదరాబాద్

క్రికెట్ నిపుణులు ఊహించినట్లే పాకిస్తాన్ క్రికెట్ జట్టు ఇంగ్లాండ్ పర్యటన ఘోర పరాజయంతో ముగిసింది. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన మూడో చివరి టెస్టులో ఇంగ్లాండ్ 8 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌పై ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మూడు టెస్టుల సిరీస్‌ను ఇంగ్లాండ్ 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసి, ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (WTC) పాయింట్ల పట్టికలో తన ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది.

రెండో ఇన్నింగ్స్‌లో పాక్ పోరాటం:

తొలి ఇన్నింగ్స్‌లో 133 పరుగులకే కుప్పకూలిన పాకిస్తాన్, ఇంగ్లాండ్ చేసిన 453 పరుగులకు సమాధానంగా రెండో ఇన్నింగ్స్‌లో కొంత పుంజుకుంది. ఒక దశలో సున్నా పరుగులకే 2 వికెట్లు కోల్పోయి రికార్డు పరాజయం వైపు పయనించిన వేళ కెప్టెన్ షాన్ మసూద్ (95), అజాన్ అవైస్ (59) కలిసి 125 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మసూద్ కేవలం 5 పరుగుల తేడాతో సెంచరీ చేజార్చుకోగా, ఆ తర్వాత వచ్చిన బాబర్ ఆజం (76) కూడా నిలకడగా రాణించాడు.

రజావుల్లా ఖాన్ ప్రపంచ రికార్డు - అరంగేట్రంలోనే మెరుపులు:

పాకిస్తాన్ ఓటమి ఖాయమనుకున్న తరుణంలో 9వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన అరంగేట్ర ఆటగాడు రజావుల్లా ఖాన్ సిక్సర్ల వర్షం కురిపించాడు. కేవలం 43 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని, టెస్ట్ అరంగేట్రంలో అత్యంత వేగవంతమైన అర్ధశతకం చేసిన పాకిస్తానీ బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. అతడు వేగంగా 81 పరుగులు సాధించగా, మహమ్మద్ అబ్బాస్ (42)తో కలిసి 9వ వికెట్‌కు ఏకంగా 121 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.



సులువుగా లక్ష్యాన్ని ఛేదించిన ఇంగ్లాండ్:

రజావుల్లా, అబ్బాస్ పోరాటంతో పాకిస్తాన్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 449 పరుగులు చేయగలిగింది. దీంతో ఇంగ్లాండ్ ముందు 130 పరుగుల చిన్న లక్ష్యం నిలిచింది. నాలుగో రోజు తొలి సెషన్‌లోనే ఇంగ్లాండ్ కేవలం 2 వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఈ లక్ష్యాన్ని ఛేదించి సిరీస్‌ను కైవసం చేసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో అతి తక్కువ పరుగులకే ఆలౌట్ కావడం పాకిస్తాన్ ఓటమిని తీవ్రంగా ప్రభావితం చేసింది.

# CINEMA

## నా సినిమాలను నేను చూడలేను



ప్రముఖ బాలీవుడ్ నటి ప్రీతి జింటా కొంత కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. కొంత విరామం తర్వాత ఆమె 'వైబ్' అనే యాక్షన్ కామెడీ మూవీతో పాటు 'బట్వారా 1947' చిత్రం గ్రాండ్ రీఎంట్రీ ఇస్తోంది. 'వైబ్'లో ఆమె 'మేడమ్ హెచ్' అనే పవర్‌ఫుల్ సూపర్ స్పై పాత్రలో కనిపించనున్నారు. వంశిక ధీర్, కునాల్ ఖేము, స్పర్ష్ శ్రీవాస్తవ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా జరిగిన ప్రమోషన్లలో నటి వంశిక ధీర్ మాట్లాడుతూ... పెద్ద తెరపై తనను తాను చూసుకున్నప్పుడు 'ఇంపాస్టర్ సింద్రోమ్' అనిపించిందని చెప్పగా, ప్రీతి జింటా ఆసక్తికరంగా స్పందించింది. ఇన్ని ఏళ్ల అనుభవం ఉన్నా, ప్రతి కొత్త పాత్ర చేసేటప్పుడు 'చేయగలనా, లేదా?' అనే సందేహం తనకూ వస్తుందని ఆమె చెప్పింది. "నేను నా సినిమాలను స్క్రీన్ పై ఎప్పుడూ చూడలేను. థియేటర్‌లో కూర్చోవడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. సినిమా చూస్తున్నంతసేపు ఈ సీన్ ఇంకా బాగా చేసి ఉంటే బాగుండేది అనే ఆలోచనే వస్తుంది" అని ప్రీతి వెల్లడించింది.

## స్పై డ్రామాతో సీక్రెట్ సోల్జర్..




నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ స్పై డ్రామా 'సీక్రెట్ సోల్జర్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రలు పోషించారు.ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్‌ను క్రియేట్ చేసింది. యూనిక్ కాన్సెప్ట్, ఆకట్టుకునే ప్రెజెంటేషన్, యాక్షన్, థ్రిల్, హ్యూమర్ ఎలిమెంట్స్‌తో విడుదలైన టీజర్ ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. 'చైనా పీస్'గా మొదలైన ప్రయాణం 'సీక్రెట్ సోల్జర్'గా ఎలా మారింది అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. 'చైనా పీస్' పేరుతోనే టీజర్ రిలీజ్ చేశాను. అలాగే రెండు పాటలు కూడా విడుదల చేశాను. అదే పేరుతో చాలా మార్కెటింగ్ చేశాం. మార్చిలో సినిమా రిలీజ్ చేద్దామని సెన్సార్‌కు పంపించాను. సెన్సార్ నుంచి అభ్యంతరాలు వచ్చాయి. రివ్యూ కమిటీలు, ఈబీసీ ఛైర్మన్, మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టర్నల్ అఫైర్స్.. ఇలా అన్ని స్థాయి లు దాటుకుని లిస్టు పంపించారు. అందులో మొదటి పాయింట్.. టైటిల్ 'చైనా పీస్' ఉండ కూడదు. ఈ కథ ఆలోచన, ఉద్దేశంతో ఆలోచించుకుని 'సీక్రెట్ సోల్జర్' అయితే బాగుంటుందని ఆ టైటిల్ పెట్టాం. సెన్సార్‌లో దాదాపు 8 నెలలు ఈ సినిమా ఉన్నప్పటికీ, మేం ఏ ఆలోచనతో సినిమా తీశామో.. ఆ ఆలోచన విషయంలో ఎలాంటి ఇబ్బంది రాలేదు. మా డైరెక్టర్ విశ్వనాథ్ గారు చాలా కష్టపడ్డారు. కంటెంట్ విషయంలో తగ్గించడానికి ఎక్కడా కూడా రాజీ పడలేదు. విజువల్స్ పరంగా చాలా చిన్న కట్స్ మాత్రమే వచ్చాయి. ఇది స్పై డ్రామా. ఇందులో స్పై యాక్షన్ కూడా చాలా రియలిస్టిక్‌గా ఉంటుంది. ఇండియా కి సంబధించిన ఓ కీలక ఇన్ఫర్మేషన్ లీక్ అయింది. ఆ సంఘటనకి నెల్లూరులో చాలా సాదాసీదాగా బతికే ఇద్దరు కుర్రాళ్లకి లింక్ ఏమిటి? ఆ సమస్యను పరిష్కరించగలిగారా లేదా? అనేది ఒక లైన్. ఫస్ట్ హాఫ్ లో ఫ్రెండ్‌షిప్ ఎమోషన్స్ చాలా బాగుంటాయి. మా ఇద్దరి క్యారెక్టర్స్ ఈ వరల్డ్‌లోకి ఎలా వచ్చాయి అనేది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. మంచి హ్యూమర్, ట్విస్టులు ఉంటాయి. ఫైనల్‌గా సినిమా ఒక మంచి ఫ్రెండ్‌షిప్ కథగా కూడా ఉంటుంది. స్నేహం, దేశభక్తి.. ఈ రెండు ఎమోషన్స్‌తో ఇప్పటివరకు చాలా తక్కువ సినిమాలు వచ్చాయి. ఇందులో అలాంటి ఒక కొత్త ఎమోషన్‌ను ఆడియన్స్ చూడబోతున్నారు. కచ్చితంగా ఈ సినిమాతో మమ్మల్ని గుర్తుపెట్టుకుంటారు అని చెప్పుకొచ్చారు.




# నవ్వులు పూయిస్తున్న 'ఆదర్శ కుటుంబం' టీజర్

వెండితెరపై కుటుంబ కథా చిత్రాలకు సరికొత్త నిర్వచనం చెప్పిన విక్టరీ వెంకటేష్ , మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్లో తెరకెక్కిన మోస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'ఆదర్శ కుటుంబం'. మొదటి నుంచి సినీ ప్రియులను విశేషంగా ఆకర్షిస్తున్న ఈ చిత్రం నుంచి ఎట్టకేలకు ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూసిన టీజర్ అధికారికంగా విడుదలైంది. తొలుత ప్రకటించిన సమయానికి కాస్త ఆలస్యమైనప్పటికీ చిత్ర బృందం రీ-షెడ్యూల్ చేసిన సమయానికి టీజర్‌ను యూట్యూబ్ వేదికగా విడుదల చేసి అభిమానులకు పసందైన వినోదాన్ని పంచింది. తాజాగా విడుదలైన 'ఆదర్శ కుటుంబం' టీజర్ ఆద్యంతం ఆహ్లాదకరమైన వినోదం, ఆకట్టుకునే భావోద్వేగాలతో సాగింది. విక్టరీ వెంకటేష్ మార్క్ సహజ నటన, టైమింగ్‌తో పలికించిన సంభాషణలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మరోవైపు త్రివిక్రమ్ తనదైన శైలి చమత్కారమైన డైలాగ్స్, కుటుంబ బంధాల ప్రాధాన్యతను చాటే సన్నివేశాలతో మరోసారి మ్యాజిక్ చేశారు. వెంకీలోని ఫ్యామిలీ మ్యాన్ ఇమేజ్‌ను, త్రివిక్రమ్ రాతలోని పదునును సరిగ్గా మేళవించి ఈ చిత్రాన్ని పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా మలిచినట్లు టీజర్ స్పష్టం చేస్తోంది. డబ్బుకి సబ్బుకి ఓ పోలికుంది... మొదటిది చూస్తుండగానే కరిగిపోద్ది, రెండో ఆలోచించేలోపే అరిగిపోద్ది,







అడుక్కునేవాళ్లకైనా ఆదివారం ఉంటుంది గానీ ఈ అప్పులోళ్లకి ఉండదు' అనే డైలాగ్స్ త్రివిక్రమ్ మార్క్‌ని చూపిస్తున్నాయి. ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండటంతో మొదటి నుంచే ఈ జోడీపై ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తి ఉంది. టీజర్‌లో ఆమె స్క్రీన్ ప్రెజెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వెంకటేష్‌తో ఆమె మధ్య వచ్చే సన్నివేశాలు చాలా ఫ్రెష్‌గా ఉండటంతో పాటు ఆమె పాత్రకు కూడా కథలో బలమైన ప్రాధాన్యత ఉన్నట్లు విజువల్స్ చూస్తే అర్థమవుతోంది. ఇప్పటివరకు సినిమా నేపథ్యంపై పూర్తి గోప్యత పాటించిన చిత్ర బృందం.. ఈ టీజర్ ద్వారా కథా వాతావరణాన్ని, పాత్రల స్వభావాన్ని పరిచయం చేస్తూ అంచనాలను ఒక్కసారిగా రెట్టింపు చేసింది. ఫ్యామిలీ ఫన్, ఎమోషన్స్‌తో పాటు క్రైమ్ అంశాలు కూడా ఈ కథలో జోడించినట్లుగా టీజర్ చూస్తుంటే అర్థమవుతోంది. మరోవైపు ఈ మూవీ రిలీజ్ వాయిదా అంటూ జరుగుతోన్న ప్రచారానికి మేకర్స్ మరోసారి చెక్ పెట్టారు. 'ఆదర్శ కుటుంబం' అక్టోబర్ 2నే థియేటర్లలోకి రానుందని టీజర్ ద్వారా అధికారికంగా ప్రకటించారు.

## కొత్త సినీ యుగానికి శ్రీకారం శ్రీమద్భాగవతం

సాగర్ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ భారతీయ సినిమా ప్రపంచంలో ఒక నూతన శకానికి శ్రీకారం చుడుతోంది. ఒకప్పుడు 'రామాయణ్', 'శ్రీ కృష్ణ' వంటి అజరామరమైన దృశ్య కావ్యాలతో కోట్లాది మంది భారతీయుల ఇళ్లల్లో, హృదయాల్లో భక్తిపరవశాన్ని నింపిన రామానంద్ సాగర్ కుటుంబం.. ఇప్పుడు అదే ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని వెండితెరపై అత్యంత వైభవంగా ఆవిష్కరించేందుకు సిద్ధమైంది. భారతీయ పురాణ చరిత్రలోనే అత్యంత విస్తృతమైన కథా సముద్రం 'శ్రీమద్భాగవతం'. ఈ పవిత్ర గాథను కేవలం రెండు మూడేళ్ల వ్యవధిలో లేదా ఒకే సినిమాలో చూపించడం సాధ్యం కాదు. అందుకే దీనిని ఒక భారీ సినిమాటిక్ యూనివర్స్‌గా మలచి, మొత్తం ఏడు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ ఆధ్యాత్మిక మహాగాథలో తొలి అడుగుగా 'శ్రీమద్భాగవతం: పార్ట్ వన్ – విష్ణురథ' రూపుదిద్దుకుంటోంది. దివంగత రామానంద్ సాగర్ వారసత్వపు బాధ్యతలను ఆయన మనవళ్లు ఆకాశ్ సాగర్ చోప్రా, అమృత్ సాగర్ తమ భుజస్కంధాలపై వేసుకున్నారు. '1971' చిత్రంతో జాతీయ చలనచిత్ర పురస్కారాన్ని అందుకున్న అమృత్ సాగర్, అనుభవజ్ఞుడైన ఆకాశ్ సాగర్‌తో కలసి ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. పాత తరం భావోద్వేగాలను, భక్తి శ్రద్ధలను కాపాడుతూనే.. నేటి తరం ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఆధునిక సినిమాటిక్ శైలిలో ఈ కథను మలుస్తున్నారు. హైదరాబాద్‌లోని ప్రసిద్ధ రామోజీ ఫిల్మ్ సిటీలో వైభవంగా ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ కోసం అత్యంత భారీ సెట్లు, అద్భుతమైన ప్రొడక్షన్ డిజైన్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రాచీన పౌరాణిక ప్రపంచాన్ని విజువల్ వండర్‌గా మార్చేందుకు అంతర్జాతీయ సాంకేతిక నిపుణులు భాగస్వాములవుతున్నారు. వంటి ప్రపంచ ప్రసిద్ధ చిత్రాలు, సిరీస్‌లకు పనిచేసిన ప్రముఖ విజువల్ ఎఫెక్ట్స్ నిపుణుడు క్లైడ్ ఎడ్వర్డ్స్ ఈ చిత్రానికి పనిచేస్తుండటం విశేషం. కేవలం



గ్రాఫిక్స్ కోసమే కాకుండా, కథలోని ఆధ్యాత్మిక లోతును, సాంస్కృతిక మూలాలను చెడగొట్టకుండా అత్యాధునిక సాంకేతికతతో దృశ్య రూపం ఇస్తున్నారు. ఇది కేవలం మరొక భక్తి చిత్రం కాదు, సాంస్కృతిక మూలాలు, కుటుంబ వారసత్వం, ఆధునిక సాంకేతికత , భారీ నిర్మాణం కలగలిసిన ఒక అరుదైన సినీ ప్రయోగం. మన ప్రాచీన పురాణ వైభవాన్ని నేటి ఆధునిక తరానికి వారి భాషలోనే, అంతర్జాతీయ ప్రమాణాలతో అందించడమే లక్ష్యంగా 'విష్ణురథ' థియేటర్లలోకి రాబోతోంది. రామాయణంతో మొదలైన సాగర్ కుటుంబ పయనం.. ఇప్పుడు 'శ్రీమద్భాగవతం'తో భారతీయ వెండితెరపై ఒక నూతన విజువల్ వండర్‌కు తెరదీస్తోంది.

## తెలుగులోకి 'హనుమాన్ అంశ్'




రూ. 2 కోట్లతో తీసిన సినిమా బాక్సాఫీస్ వద్ద రూ. 150 కోట్లకు పైగా కలెక్ట్ చేసిందంటే ఎవరైనా షాక్ అవ్వాల్సిందే. అది కూడా ఎలాంటి స్టార్ కాస్ట్, ప్రమోషన్లు, అంచనాలు లేకుండా సైలెంట్ బాలీవుడ్ లో రిలీజ్ అయిన ఓ చిన్న సినిమా గురించి ఇప్పుడు యావత్ దేశం మొత్తం మాట్లాడుకుంటుంది. అదే "హనుమాన్ అంశ్" చిత్రం.. ఈ సినిమాను ఇంతలా ఆదరించడానికి గల కారణం ఏంటి..? అని అను కుంటున్నారా..? ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలీ బాబా జీవితం ఆధారంగా ఈ సినిమా రూపొందింది. కేవలం ప్రేక్షకుల మౌత్ టాక్ తో పుంజుకుని ఇప్పుడు ఏకంగా రూ. 150 కోట్లకు పైగా కలెక్షన్లు కొల్లగొట్టింది. అయితే ఇప్పుడు ఈ మూవీ తెలుగులోనూ రాబోతోంది. టాలీవుడ్ ప్రముఖ దర్శ కుడు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ హనుమాన్ అంశ్ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నారు.త్రివిక్రమ్ సమర్పణలో ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 18 న తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ చేయనుంది. నీమ్ కరోలి బాబా భక్తుల భావోద్వేగాలను, ఆయన జీవితంలోని ముఖ్య ఘట్టాలను అద్భుతంగా ఆవిష్కరించిన ఈ ఆధ్యాత్మిక సినిమా తెలుగు ప్రేక్షకులను కూడా ఎంతగానో ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. భక్తి రస చిత్రాలను ఆదరించడంలో తెలుగు ప్రేక్షకులు ముందుంటారు. ఆ కారణంతోనే ఈ సినిమాను తెలుగులోనూ రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. ఇక హనుమాన్ అంశ్ చిత్రానికి విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించారు. అలాగే ఈ చిత్రంలో శోభినావ్ సత్య, విహాన్ శెడ్గే ప్రధాన పాత్రల్లో నటించారు.

